నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 23-10-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:69 పేజీలు:4 వెల: రూ.1/-

తెలంగాణలో కొత్తగా 1,456 కరోనా కేసులు

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): తెలంగాణలో కరోనా ఉధృతి కొనసాగుతోంది. తెలంగాణ హెల్త్ బులిటెన్‌ను వైద్య ఆరోగ్యశాఖ విడుదల చేసింది. తెలంగాణలో గడిచిన 24 గంటల్లో కొత్తగా 1,456 కరోనా కేసులు నమోదు అయ్యాయి. గడిచిన 24 గంటల్లో కరోనాతో ఐదుగురు మృతి చెందారు. తెలంగాణ వ్యాప్తంగా కరోనా కేసుల సంఖ్య 2,27,580కి చేరుకుంది. కాగా.. ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 1,292 మంది మృతి చెందారు. ప్రస్తుతం తెలంగాణలో 20,183 యాక్టివ్ కేసులు ఉన్నాయి. ఇప్పటి వరకూ కరోనా నుంచి 2,06,105 మంది కోలుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా 254, రంగారెడ్డి 98, నల్గొండ 92 కేసులు నమోదు అయ్యాయి.

బెంగాల్ గడ్డపై ఎందరో వీరులు ఉద్భవించారు

దేశానికి దిశా నిర్దేశం చేసిన వారెందరో బెంగాలీలే
బెంగాల్ సంస్కృతి నుంచి వచ్చిందే నవరాత్రి ఉత్సవం
-వర్చువల్ ప్రసంగంలో ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): శరన్నవ రాత్రులు దేశ ఐకమత్యాన్ని, బలాన్ని చూపుతాయని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. బెంగాల్ నుంచి వచ్చిన సంస్కృతి, సంప్రదాయాలకు ఈ నవరాత్రులు ప్రతిబింబమని అన్నారు. కీలక సమయాల్లో భారత దేశానికి దిశా నిర్దేశం చేయడంతోపాటు, అవసరమైన ప్పుడు అండగా నిలబడటంలో బెంగాల్ రాష్ట్రం ముందుంటుందని ప్రధాని మోదీ అన్నారు. దేశ చరిత్రను పరిశీలిస్తే ఈ విషయం సులభంగా అర్థమవుతుందని చెప్పారు. భారతదేశాన్ని సక్రమమార్గంలో నడిపించిన ఎందరో మహానుభావులు ఈ రాష్ట్రానికి చెందిన వారే కావడం గర్వకారణమని కొనియాడారు. వారి సేవలను గుర్తు చేసుకున్న ప్రధాని మోడీ దసరా సందర్భంగా పశ్చిమబెంగాల్‌లోని సాల్ట్‌లేక్‌లో ఉత్సవాలను ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ ఉత్సవాలను విజయదశమి వరకు 5 రోజుల పాటు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్యోద్యమంలో పశ్చిమబెంగాల్ నుంచి ఎంతో మంది కవులు, ఆర్టిస్టులు, రచయితలు పాల్గొన్నారన్నారు. ఆ మహానుభావులందరి పేర్లను ఒక్కొక్కటిగా చెప్పాలంటే ఈ రోజు మొత్తం కూడా చాలదని అన్నారు. వారి సేవలను దేశం ఎన్నటికీ గుర్తుంచుకుంటుందని చెప్పారు. ఈ సంవత్సరం దుర్గా పూజలను కోవిడ్ మధ్య జరుపుకుంటున్నామని, భక్తులందరూ ఆదర్శప్రాయమైన నిగ్రహాన్ని చూపించాలని ఆయన పిలుపునిచ్చారు. వ్యక్తుల సంఖ్య తక్కువగా ఉంటే ఉండవచ్చు కానీ.... భక్తిలో మాత్రం ఎలాంటి మార్పూ ఉండదని ఆయన పేర్కొన్నారు. కోవిడ్ మధ్య దుర్గ పూజలను జరుపుకుంటున్నా... వ్యక్తుల ఆనందంలో, ఉత్సాహంలో ఎలాంటి మార్పూ లేదని, ఇదీ... నిజమైన బెంగాల్ అని మోదీ ప్రశంసించారు. కోవిడ్ కారణంగా ప్రతి ఒక్కరూ రెండు గజాల దూరం పాటిస్తూ, మాస్క్ కచ్చితంగా ధరించి పండుగను జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బెంగాల్ గడ్డలో పుట్టిన మహానుభావులందరికీ మోదీ నివాళు లర్పించారు. బెంగాల్‌లో ఉన్నట్లే నాకు అనిపిస్తోంది. ఈ పూజ మీతో జరుపుకున్నందుకు సంతోషంగా ఉంది. భారత దేశ చరిత్రలో అవసరం వచ్చినప్పుడల్లా బెంగాల్ అందుకు ఓ మార్గాన్ని చూపింది. ఈ గడ్డ నుంచి చాలా మంది మహానుభావులే ఉద్భవించారు. దేశానికి సరైన మార్గదర్శకత్వం అవసరమైనప్పుడల్లా బెంగాల్ గడ్డ సహకారం అందించింది. దేశాన్ని బెంగాల్ లోని మహానుభావులు సరైన దిశలో నడిపించారు. వారి పేర్లను చెబుతూ పోతే... రోజంతా గడుస్తుంది కానీ... పేర్లు మాత్రం ముగియవు. భారత దేశం గర్వించేలా బెంగాల్ ప్రజలు మసులుకున్నారని మోదీ పేర్కొన్నారు. ఆత్మ నిర్భర భారత్' లో బెంగాల్ పాత్ర పుష్కలంగా ఉందని మోదీ కొనియాడారు. ఆత్మనిర్భర భారత్ అన్న నినాదాన్ని తీసుకొని దేశం ముందుకెళ్తోందని, దీని కిందనే బెంగాల్‌లో అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. పీఎం ఆవాస్ యోజన కింద 30 లక్షల ఇళ్లు నిర్మించామని, ఉజ్వల యోజన పథకం కింద 90 లక్షల మంది మహిళలకు గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినట్లు మోదీ పేర్కొన్నారు. వీటితో పాటు నాలుగు లక్షల మంది బ్యాంక్ ఎకౌంట్లను తెరిచారని, మెట్రో ప్రాజెక్టును కూడా వేగవంతం చేసినట్లు మోదీ పేర్కొన్నారు. దసరా మహోత్సవం దేశ ఐక్యతను ప్రతిబింబిస్తుందని మోదీ చెప్పారు. బెంగాల్ సంస్కృతికి, ఆచార వ్యవహారాలకు దసరా నిదర్శనమన్నారు. మహిళలు దుర్గామాతకు ప్రతిరూపాలు. వారి అభ్యున్నతికి బేటీ బచావో..బేటీ పఢావో కార్యక్రమాన్ని తీసుకొచ్చామని మోదీ గుర్తు చేశారు. కరోనా వైరస్ వ్యాప్తి నేపథ్యంలో పండగల వేళ ప్రజలంతా అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రధాని మోదీ మరోమారు కోరారు. మాస్కులు ధరిస్తూ.. తప్పని సరిగా సామాజిక దూరం పాటించాలని కోరారు.

ప శ్చిమ బెంగాల్‌లో వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మోదీ ప్రసంగాన్ని తమకు అనుకూలంగా మార్చుకునేందుకు భాజాపా ప్రయత్నించింది. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా టీవీలు, ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేసి ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేసింది. రాష్ట్రంలోని 78,000 బూత్ ఏరియాల్లోనూ పార్టీ కార్యకర్తలు ఈ ఏర్పాట్లు చేశారు. తాను మహాశక్తి దుర్గా పూజలో పాల్గొనబోతున్నట్లు ప్రధాని మోదీ బుధవారమే ట్విటర్ వేదికగా వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని పార్టీ శ్రేణులు ముందుగానే ఏర్పాట్లు చేశాయి.

నాయిని నర్సింహారెడ్డి భౌతిక కాయం వద్ద నివాళి అర్పించిన మంత్రులు సత్యవతి రాథోడ్, తలసాని

తెలంగాణ ఉద్యమ నేత నాయిని

-ఆయనతో అనుబంధాన్ని గుర్తు చేసుకున్న కెటిఆర్

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): నాయిని నర్సింహారెడ్డి తెలంగాణ ఉద్యమంలో సీఎం కేసీఆర్ వెంట నిలిచిన ఉద్యమ నేతగా నిలిచారని మంత్రి కేటీఆర్ అన్నారు. జన నాయకుడిగా, కార్మిక పక్షపాతిగా, తెలంగాణ తొలి హోంమంత్రిగా అందరి మనస్సుల్లో నిలిచిపోతారని కేటీఆర్ అన్నారు. గురువారం నాయిని మృతికి సంతాపం ప్రకటించారు. ఆయన లేని లోటు పార్టీకి, తెలంగాణ సమాజానికి తీరని లోటన్నారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధం, జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఫొటోలను ట్విటర్‌లో ఫొటోలు షేర్ చేశారు. 'జీవితమంతా అణగారిన వర్గాల కోసం పోరాడిన యోధుడని, మీ ఆత్మశాంతికి శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నాను' అని ట్వీట్ చేశారు.

రాజకీయ ఎదుగుదలకు నాయిని కారణం: జనారెడ్డి

తన రాజకీయ ఎదుగుదలకు నాయిని నరసింహారెడ్డి కృషి మరవలేనిదని కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి అన్నారు. నాయిని పార్థివ దేహానికి నివాళులు అర్పించిన జానారెడ్డి.. నాయినితో తనకు చాలా సన్నిహితం ఉందన్నారు. తమ జిల్లా వాసి నాయిని ఇకలేరని జీర్ణించుకోలేక పోతున్నానన్నారు. సోషలిస్టు పార్టీలో నాయిని క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. సోషలిస్టు పార్టీలో నాయిని ఉన్న సమయంలో తాను రాజకీయాల్లోకి వచ్చానన్నారు. 1978 జనతా పార్టీలో కూడా నాయినితో కలిసి పనిచేశానన్నారు. ప్రజా సమస్యలపై నాయిని నిరంతరం కృషి చేసే వాడన్నారు. నాయిని ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. నాయిని నర్సింహారెడ్డితో తనకు చాలా సన్నిహితం ఉందని జానారెడ్డి తెలిపారు. నాయిని తమ జిల్లా వాసే అని... ఆయన ఇకలేరన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. తమతో పాటు మంత్రిగా పనిచేసిన వ్యక్తి అని... సోషలిస్టు పార్టీలి క్రియాశీలక పాత్ర పోషించారని అన్నారు. సోషలిస్టు పార్టీలో నాయిని ఉన్న సమయంలో తాను కూడా రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. మంత్రిగా ఉన్నప్పుడు ప్రతిపక్షంలో నాయిని ఉన్నారని ఆయనన మరణం మరువలేనిదని చెప్పుకొచ్చారు. ప్రజా సమస్యలపై నిరంతరం నాయిని కృషి చేసేవార్నారు. నాయిని ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతున్నానని...ఆయన కుటుంబానికి జానారెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

కార్మిక లోకానికి తీరని లోటు: నారాయణ

మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి మరణం కార్మిక లోకానికి తీరని లోటు అని సీపీఐ నేత నారాయణ అన్నారు. మాజీమంత్రిగా, పలుదపాలు శాసనసభ్యులుగా, మండలి సభ్యులుగా కార్మిలోకానికి యెనలేని సేవలు చేసిన నాయిని ఇకలేడని చెప్పడానికి విచారిస్తున్నానని ఆవేదన వ్యక్తం చేశారు. జీవిత చివరాకంలో కొంత రాజకీయ అసంతృప్తి వారిని వెంటాడింది.... అయినా నిబద్ధతగానే జీవితం ముగించారని తెలిపారు. నాయిని మరణం పట్ల నారాయణ ప్రగాఢ సంతాపం తెలియజేస్తూ... కుటుంబసభ్యులకు, కార్మికలోకానికి సానుభూతిని తెలిపారు.

నాయిని మృతికి గవర్నర్ తమిళ సై సంతాపం

కార్మిక పక్షపాతి అన్న కవిత, హరీష్ రావు

హైదరాబాద్,అక్టోబర్22 (ఆర్ఎన్ఎ): తెలంగాణ మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మృతిపట్ల గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ సంతాపం ప్రకటించారు. నాయిని కుటుంబ సభ్యులకు గవర్నర్ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాయిని చివరి శ్వాస వరకు తెలంగాణ అభివృద్ధి కోసం కృషి చేశారని గవర్నర్ కొనియాడారు. తెలంగాణ గొప్ప నాయకుడిని కోల్పోయిందని తమిళిసై పేర్కొన్నారు. నాయిని నర్సింహారెడ్డి మృతిపట్ల మంత్రి హరీష్ రావు, ఎమ్మెల్సీ కవిత సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. కార్మిక పక్షపాతి, టీఆర్ఎస్ సీనియర్ నేత నాయిని నర్సింహా రెడ్డి మరణం బాధాకరమని కవిత అన్నారు. తొలిదశ ఉద్యమం నుంచి నేటి వరకు రాష్ట్రం కోసం, కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలూ పాటుపడిన వ్యక్తి నర్సన్న. వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అని కవిత ట్వీట్ చేశారు. తెలంగాణ మాజీమంత్రి నాయిని నర్సింహారెడ్డి మరణం అత్యంత బాధాకరమని హరీష్ రావు అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం తొలి, మలి దశ ఉద్యమాల్లో వారు చేసిన పోరాటం గొప్పది. కార్మికులు, పేదల పక్షపాతిగా వారి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేసిన గొప్ప వ్యక్తిత్వం నర్సన్నది. వారు లేని లోటు ఎన్నటికి పూడ్చలేనిది అని హరీష్ రావు ట్వీట్ చేశారు.

దీక్షిత్ హంతకులు అదుపులోనే ఉన్నారు

ఎన్‌కౌంటర్ వార్తలను ఖండించిన ఎస్పీ

మహబూబాబాద్,అక్టోబర్22 (ఆర్ఎన్ఎ): మహబూబాబాద్ కృష్ణా కాలనీకి చెందిన దీక్షిత్ రెడ్డి(9) హత్య కేసులో నిందితుడు మందసాగర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అయితే దీక్షిత్ రెడ్డిని ఎక్కడైతే హత్య చేశారో అదే ప్రాంతంలో నిందితుడిని ఎన్‌కౌంటర్ చేసినట్లు వార్తలు వినిపించాయి. ఈ వార్తలపై మహబూబాబాద్ ఎస్పీ కోటిరెడ్డి వివరణ ఇచ్చారు. మంద సాగర్‌ను ఎన్‌కౌంటర్ చేయలేదని, అతను తమ అదుపులోనే ఉన్నాడని స్పష్టం చేశారు. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు అరెస్టు చేశామన్నారు. మంద సాగర్‌తో పాటు మనోజ్ రెడ్డి అనే వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నాం. ఇప్పటి వరకైతే దీక్షిత్‌ను కిడ్నాప్ చేసి, హత్య చేసింది మంద సాగర్ అని విచారణలో తేలింది. మనోజ్ రెడ్డి పాత్రపై కూడా విచారణ చేస్తున్నామని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను వెల్లడిస్తామని ఎస్పీ కోటిరెడ్డి పేర్కొన్నారు.

నాయిని పాడె మోసిన మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్,అక్టోబర్22హైదరాబాద్ : తెలంగాణ మాజీ హోంమంత్రి, టీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాయిని నర్సింహారెడ్డి అంత్యక్రియలకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో పాటు పార్టీ నాయకులు హాజరయ్యారు. అంత్యక్రియల్లో భాగంగా నాయిని పాడెను మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ మోశారు. ఆ తర్వాత పలువురు ప్రజాప్రతినిధులు నాయిని పాడె మోసి నివాళులర్పించారు. నాయినిని కడసారి చూసేందుకు జనం పెద్ద ఎత్తున వచ్చారు. జూబ్లీహిల్స్ మహాప్రస్థా నంలో అధికారిక లాంఛనాలతో నాయిని నర్సింహారెడ్డి అంత్యక్రియలను నిర్వహిస్తున్నారు.

నాయిని అంత్యక్రియల్లో భాగంగా ఆయన పాడెను మంత్రులు కేటీఆర్, శ్రీనివాస్‌గౌడ్ మోశారు.

నాయిని మరణం తీరని లోటు

దిగ్భ్రాంతి వ్యక్తంచేసిన సిఎం కెసిఆర్ మంత్రులు, నేతల దిగ్భ్రాంతి..ఘనంగా నివాళి

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): నాయిని మృతిపట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధికార లాంఛనాలతో ఆయన అంత్యక్రియలు నిర్వహించాలని సీఎం కేసీఆర్ సీఎస్‌ను ఆదేశించారు. బుధవారం సాయంత్రమే సిఎం అపోలో వెళ్లి ఆయన ఆరోగ్యంపై ఆరా తీసారు. రాత్రి మృతి చెందినట్లు తెలుసుకుని తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. తెలంగాణ ఉద్యమంలో నాయిని పాత్ర మరువలేనిది గుర్తుచేశారు. నాయిని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. నాయిని మృతిపట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంతాపం తెలిపారు. నాయిని మృతిపై కార్మిక సంఘాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు. నాయిని మృతిపట్ల మంత్రి నిరంజన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాయిని మరణం పార్టీకి, తెలంగాణకు తీరని లోటన్నారు. నాయిని కుటుంబ సభ్యులకు నిరంజన్‌రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాయిని నర్సింహారెడ్డి మరణం టీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ సమాజానికి తీరని లోటని నిరంజన్ రెడ్డి అన్నారు. అయిదు దశాబ్దాలుగా ప్రజల మనిషిగా ఆయన రాజకీయాల్లో, కార్మికనేతగా పనిచేశారని, 1969 తెలంగాణ ఉద్యమంలో, 2001 నుండి మలిదశ తెలంగాణ ఉద్యమంలో వారి పాత్ర అనన్య సామాన్యమని గుర్తు చేశారు. 2001 నుండి 2014 వరకు తెలంగాణ ఉద్యమ సమయంలో వారితో ఉన్న అనుబంధం మరువలేనిదని, నర్సన్న ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నాయినితో కలిసి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నానని ప్రజాగాయకుడు గద్దర్ అన్నారు. ఉద్యమాలు, త్యాగాలు, పదవులు ఆయన నుంచి నేర్చుకున్న పాఠాలని తెలిపారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. నాయిని నర్సింహారెడ్డి కార్మిక పక్షపాతి అని, వారి హక్కుల్ని కాపాడారని మంత్రి జగదీష్ రెడ్డి అన్నారు. ఆయన మరణం చాలా బాధకమని దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నాయినిది చిన్నపిల్లల మనస్తత్వమని ఆయన మృతికి తీవ్ర సంతాపం ప్రకటించారు. మంత్రుల నివాస ప్రాంగణంలో నాయిని పార్థివదేహాన్ని ఆయన ఉదయం తన సతీమణి సునీతా జగదీష్ రెడ్డితో కలసి సందర్శించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో దేవరకొండ ప్రాంతం నుండి వచ్చి అంచెలంచెలుగా ఎదిగి కార్మిక నాయకుడిగా తొలి తెలంగాణా ప్రభుత్వంలో హోంమంత్రిగా పనిచేశారని అన్నారు. ఉద్యమ సమయంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో పార్టీ బాధ్యతలు పంచుకున్న నేతగా నాయిని అందించిన సేవలను మంత్రి జగదీష్ రెడ్డి స్మరించుకున్నారు. ఉద్యమ కాలం నుండి తొలి తెలంగాణా మంత్రి వర్గంలో నాయినితో తనకున్న సంబంధాలను గుర్తు చేసుకున్నారు. అటువంటి నేత మరణం తీరని లోటు అని ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కుటుంబ సభ్యులు మరింత ధైర్యంగా ఉండాలని మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు.

నాయిని తనకు అత్యండ ఆత్మీయుడని కాంగ్రెస్ నేత జానారెడ్డి అన్నారు. నల్గొండ జిల్లా వాసి అని, ఆయన తమకు ఆదర్శం అన్నారు. నాయిని చనిపోవడం బాధాకరమని తెలిపారు. ఆయన్ని చూసి ప్రభావితుడనై రాజకీయాల్లోకి వచ్చానని జానారెడ్డి అన్నారు. నాయిని నర్సింహారెడ్డి మరణం పట్ల ఏపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రగాఢ సంతాపం తెలిపారు. కార్మిక నాయకునిగా సుదీర్ఘ కాలం రాజకీయ జీవితం గడిపిన నేత నాయిని అని గుర్తు చేశారు. ప్రజా సమస్యలపై ఉమ్మడి పోరాటాల్లో కలిసి వచ్చేవారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర మొట్ట మొదటి హోంమంత్రిగా పనిచేసిన నరసింహారెడ్డి మరణం బాధాకరం అన్నారు. ఆయన మరణం పట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. నాయిని నర్సింహారెడ్డి ఆకస్మిక మృతి పట్ల రాష్ట్ర శాసనసభ సభాపతి పోచారం శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాలలో పాల్గొన్న తెలంగాణ పోరాట యోధుడు నాయిని అని గుర్తు చేశారు. కార్మిక నాయకుడిగా ఉంటూ కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం కృషి చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన మరణం తెలంగాణ రాష్ట్రానికి తీరని లోటు అన్నారు. నాయిని నర్సింహారెడ్డి పార్థివ దేహానికి మంత్రి మల్లారెడ్డి నివాళులు అర్పించారు. కార్మిక నాయకులు నర్సన్న లేకపోవడం బాధాకరం అన్నారు. కార్మిక లోకానికి నాయిని చేసిన సేవలు మరచిపోలేమని తెలిపారు. ప్రభుత్వాలతో కోట్లాడి కార్మికుల హక్కులను కాపాడే వారు నాయిని అని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో నాయిని చేసిన పోరాటం మరచిపోలేమన్నారు. తెలంగాణ తొలి హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి పార్థివ దేహానికి తెలంగాణ చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్ నివాళులు అర్పించారు. ÷నాయిని నర్సింహారెడ్డి మృతి పట్ల మాజీ మంత్రి సమరసింహారెడ్డి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

నాయిని నర్సింహారెడ్డి మృతి చాలా బాధాకరం అని డిప్యూటీ స్పీకర్ పద్మారావు నివాళి అర్పించారు.

దీక్షిత్ కిడ్నాప్ కథ విషాదాంతం

బాలుడిని చంపి పెట్రోల్‌తో తగులబెట్టిన కిడ్నాపర్లు
కిడాప్ చేసిన గంటలోనే చంపేసినట్లు ఎస్పీ వెల్లడి
ఈజీ మనీ కోసం ఘాతుకానికి పాల్పడిన దుండగులు

మహబూబాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): దీక్షిత్ కిడ్నాప్ వ్యవహారం విషాదంగా ముగిసింది. కిరాతకులు బాలుడిని చంపి పెట్రోల్ పోసి తగులబెట్టారు. మహబూబాబాద్‌లో కిడ్నాప్ అయిన దీక్షిత్ రెడ్డి పాలిట మేనమామ కంసుడిలా మారాడు. డబ్బులు కోసం తోబుట్టువుకు కడుపుకోత మిగిల్చాడు. మేల్లుడిని దారుణంగా హతమార్చాడు. ఈ సంఘటన స్థానికంగా సంచలనం రేపుతోంది. గత ఆదివారం కిడ్నాప్ చేసిన దీక్షిత్ రెడ్డి... కిడ్నాపర్లు రెండు గంటల్లోనే బాలుడిని చంపేశారు. కిడ్నాప్‌కు సూత్రధారుడు మనోజ్‌రెడ్డితో పాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంద సాగర్ అనే వ్యక్తితో కలిసి బాలుడిని హత్య చేసినట్లుగా తెలుస్తోంది. మహబూబాబాద్‌కు 5 కిలోమీటర్ల దూరంలోని గుట్టలో బాలుడి మృతదేహం లభించింది. కొడుకు క్షేమంగా తిరిగి వస్తాడని ఆశపడ్డ ఆ తల్లి రోదన చూపరులను కంటతడి పెట్టిస్తోంది.

మహబూబాబాద్ కృష్ణా కాలనీకి చెందిన రంజిత్, వసంత దంపతుల పెద్ద కుమారుడు దీక్షిత్‌రెడ్డి ఇంటి ముందు ఆడుకుంటుండగా గత ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని దుండగుడు బైక్‌పై వచ్చి కిడ్నాప్ చేశారు. రాత్రి అయినా బాలుడు ఇంటికి రాకపోవడంతో పరిసర ప్రాంతాలను వెతుకగా ఓ వ్యక్తి బైక్‌పై తీసుకెళ్లాడని తోడి స్నేహితులు చెప్పారు. రాత్రి 9:45 నిమిషాలకు కిడ్నాపర్లు బాలుడి తల్లికి ఫోన్ చేసి రూ.45 లక్షలు ఇస్తే తమ బాలుడిని విడిచిపెడతామన్నారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పవద్దని హెచ్చరించారు. పోలీసులకు ఫిర్యాదు చేయవద్దని, బాలుడి ఇంటి పరిసర ప్రాంతాల్లో తమ వ్యక్తులు ఉన్నారని బెదిరించారు. మంగళవారం రాత్రి కిడ్నాపర్లు మరోసారి ఫోన్ చేసి డబ్బులు రెడీ అయ్యాయా, బుధవారం ఉదయం ఫోన్ చేస్తాం అని చెప్పారు.

చెప్పినట్లుగానే బుధవారం ఉదయం ఫోన్ చేసిన కిడ్నాపర్లు డబ్బు సిద్ధం చేసుకోండి, బ్యాగులో డబ్బు పెడుతున్నప్పుడు వీడియో కాల్ చేస్తే తమకు చూపించాలని చెప్పినట్లు సమాచారం. అన్నట్లుగానే మధ్యాహ్నం 12 గంటలకు కిడ్నాపర్లు వీడియో కాల్ చేయగా, బాలుడి తల్లిదండ్రులు డబ్బు చూపించారు. దీంతో కిడ్నాపర్ జిల్లా కేంద్రంలోని మూడు కొట్ల చౌరస్తా వద్ద డబ్బు బ్యాగ్‌తో ఉండాలని,, వచ్చి తీసుకుంటామని చెప్పారు. దీంతో బాలుడి తండ్రి మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు డబ్బుతో ఎదురుచూశారు. ఆ సమయంలోనే పోలీసులు మాటువేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలను గురువారం ఉదయం ఎస్పీ కోటిరెడ్డి వెల్లడించారు. దీక్షిత్‌ను హత్య చేశారని తెలియడంతో.. తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు బాలుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బాలుడి కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడు మంద సాగర్(23)ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఈ సందర్భంగా మహబూబాబాద్ ఎస్పీ కోటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. మహబూబాబాద్‌లోని కృష్ణ కాలనీలో నివాసం ఉంటున్న రంజిత్, వసంతల పెద్ద కుమారుడు దీక్షిత్‌రెడ్డి(9) ఆదివారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. శనిఘాపురం వాసి అయిన మంద సాగర్ సాయంత్రం 6 గంటల సమయంలో బైక్‌పై వచ్చి.. బాలుడిని ఎక్కించుకుని వెళ్లాడు. ఆ తర్వాత.. అన్నారం వద్ద దానమయ్య గుట్ట వద్దకు తీసుకెళ్లిన సాగర్.. గంటలోపే బాలుడి గొంతు పిసికి హత్య చేశారు. రాత్రి 8 గంటల్లోపే సాగర్ ఈ దారుణానికి పాల్పడ్డాడు.

చంపిన తరవాత తల్లిదండ్రులకు ఫోన్

తల్లి వసంతకు సాగర్ ఫోన్ చేసి రూ.45 లక్షలు ఇస్తే విడిచిపెడతామని, ఈ విషయాన్ని మీరు ఎక్కడా చెప్పవద్దు, పోలీసులకు కంప్లైంట్ చేయవద్దు అని చెప్పాడు. మీ ఇంటి పరిసర ప్రాంతాలలో మా వ్యక్తులు ఉన్నారంటూ బెదిరించారు. మీరు ఏం చేసినా తమకు తెలుస్తుందని, మీ బాబుకు జ్వరం గా ఉంది మాత్రలు కూడా వేశాం అని చెప్పి ఫోన్ పెట్టేశారు. దీంతో దీక్షిత్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పుడే కేసు నమోదు చేసి బాలుడి ఆచూకీ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

మందసాగర్.. దీక్షిత్ కుటుంబానికి తెలుసు. డబ్బు డిమాండ్ చేసి దీక్షిత్‌ను వదిలిపెడితే తనకు ఏం జరుగుతుందో అని ఆందోళన చెందే బాలుడిని హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటర్నెట్ కాల్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. బాలుడిని చంపిన తర్వాత కూడా రెండు రోజుల పాటు ఫోన్ చేసి తల్లిదండ్రులను బెదిరించాడు. అయితే బాలుడి హత్య విషయం బయటకు రావొద్దనే ఉద్దేశంతో.. మళ్లీ దానమయ్య గుట్ట వద్దకు వెళ్లి శవంపై పెట్రోల్ పోసి తగులబెట్టాడు. అయితే ఈజీగా డబ్బులు సంపాదించి.. విలాసవంతమైన జీవితం గడపాలనే ఉద్దేశంతోనే దీక్షిత్‌ను కిడ్నాప్ చేసినట్లు పోలీసులు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానంతోనే నిందితుడు మంద సాగర్‌ను అరెస్టు చేశామని ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. ఇంటర్నెట్ కాల్స్ ద్వారానే నిందితుడిని గుర్తించగలిగామన్నారు. గురువారం ఉదయం 3 గంటలకు సాగర్ ను అరెస్టు చేశామన్నారు. ఈ కేసును చేధించేందుకు హైదరాబాద్, వరంగల్ టాస్క్‌ఫోర్స్‌తో పాటు సైబర్ క్రైమ్ పోలీసులు కీలక పాత్ర పోషించారు.

సచివాలయంలో సిఎస్‌తో కేంద్రబృందం భేటీ

వరదలపై ఫోటో ఎగ్జిబిషన్ తిలకించిన అధికారులు
వరద నష్టంపై వివరాలు సేకరించిన బృందం

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో ముఖ్యంగా హైదరాబాద్‌లో వరదల నష్టాన్ని కేంద్ర బృందానికి ప్రభుత

ప్రకృతి విలయానికి ప్రజలే బాధ్యులా ?

నేటినిజం
శుక్రవారం 23-10-2020

ఎవరి బాధలు వారివి..ఎవరి కష్టాలకు వారే బాధ్యులు...ప్రకృతి ప్రకోపానికి ఎవరైనా బలయితే వారిదే బాధ్యత... వారే తమ కష్టాల నుంచి బయటపడే ప్రయత్నాలు చేసుకోవాలి. వారిని ఆదుకునేందుకు ప్రజలు సమిష్టిగా ముందుకు రారు. ప్రభుత్వాలు కూడా కంటితుడుపు చర్యలతో చేతులు దులుపుకుంటుంది. ఇటీవలి వరదలతో నీట మునిగిన ప్రజలకు తెలిసి వచ్చిన నిజం ఇది. ముమ్మాటికీ ఇది నిజంగా నిజం. ఎందుకంటే పంటలు కొట్టుకుపోయి బోరుమంటున్న రైతులకు భరోసా దక్కలేదు. లంకగ్రామాలు కావచ్చు..లేదా ఇతర గ్రామాలు కావచ్చు ప్రజలు ఇంకా నీళ్లల్లోనే మగ్గుతున్నారు. వారి బాధలను తీర్చే నాధుడు లేడు. అలాగే హైదరాబాద్‌లో వందలాది కాలనీలు నీట మునిగి..ఇంకా నీటిలోనే తేలియాడు తున్నా.. ఒక్కో కుటుంబానికి కనీసం ఓ రెండు లక్షల వరకు నష్టం జరిగినా వారిని పట్టుకుని ఓదార్చే పాలకనాధుడు లేడు. మీకెందుకు మేమున్నామన్న బరోసా లేదు. వరదల్లో సర్వం కోల్పోయిన వారికి పదివేలతో నగరంలో షో చేస్తున్నారు. ఇందులోనూ రాజకీయాలు కనిపిస్తున్నాయి. కోస్తాంధ్రలో రైతులు మొత్తం పంటలను కోల్పోయారు. పాలకులు రివ్యూలమీద రివ్యూలు పెట్టినా ఒరిగిందేమీ లేదు. ఈ నెల 13వ తేదీ నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వేలాది సంఖ్యలో కాలనీలు నీటమునిగాయి. జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. వేల సంఖ్యలో ప్రజలు నిరాశ్రయులయ్యారు. పాతబస్తీ జలదిగ్బంధంలోనే కొనసాగుతోంది. ప్రధానంగా లోతట్టు కాలనీల్లో ముంపు కష్టాలు వీడటం లేదు. సరూర్‌నగర్‌లోని పలు కాలనీలు ఇంకా వరద గుప్పిట్లోనే కొనసాగుతున్నాయి. తగ్గిందనుకునే లోపే మళ్లీ వర్షాలు కురుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. తమను ఆదుకునే వారు లేరా.. అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇవన్నీ కంటికి కనిపిస్తున్న దృశ్యాలు. టీవీలు రోజూ గొంతెత్తి అరుస్తూ విజువల్స్ చూపిస్తు న్నారు. అలా చూపిన వారిలో కనీసం ఒక్కరినైనా కార్పోరేటర్లు, మంత్రులు పలకరించి బాధలను తొలగి స్తామని చెప్పలేక పోయారు. నిజంగా మన దౌర్భాగ్యం కాకపోతే అల్పులను ఎన్నుకుంటే ఎంతగా అనర్థాల కు గురి కావాలో బాధితులకు తెలిసివచ్చింది. రైతులను గురించి పట్టించుకునే వారు లేరు. వారి ధాన్యం గురించి చింతచేయడం లేదు. ఆదుకుంటామన్న హామీ ఇవ్వడం లేదు. నిండా మునిగిన వారిని కష్టాల నుంచి గట్టెక్కించే చర్యల గురించి ఆలోచన చేసి ఉంటే పరిస్థితి ఇంత దారుణంగా ఉండదు. పండగల వేళ కొందరు ప్రజలు నీటమునిగి...ఇళ్లలోంచి బయటకు రాకుంటే ఎలా అన్న ఆలోచన ప్రభుత్వాలు చేసివుంటే ఇవాళ వారికి ఊరట దక్కేది. లక్షలకొద్దీ కార్యకర్తలు ఉన్నారని బీరాలు పలుకుతున్న పార్టీలన్నీ తమ కార్యకర్తలను రంగంలోకి దించి ఉంటే ప్రజలు గట్టెక్కేవారు. కానీ అధికార పార్టీ మొదలు విపక్ష పార్టీ వరకు ఎవరు కూడా అలా చేయ లేదు. సరికాదా..ఒకరిపై మరొకరు విమర్శలతో కాలం గడిపారు. ఇప్పటికే కురిసిన వర్షాలు భాగ్యనగర వాసుల జీవితాన్ని మరింత అల్లకలో లానికి గురిచేసాయి. జోరు వానలతో వరదనీరు వచ్చి చేరుతోంది. వర్షం కారణంగా పురాతన ఇళ్లు గోడలు కూలుతున్నాయి. నగరంలో పురాతన భవనాలను గుర్తించి వాటిని కూల్చివేస్తున్నారు. చెరువులు, కుంటలను కబ్జా చేసి ఇళ్లు నిర్మించుకోవటం.. నాలాల ఆక్రమణెళి వరద ముంపునకు కారణమని ప్రధాన కారణమని నగరవాసులు అభిప్రాయపడుతున్నారు. అందుకే కాలనీల్లో నాలాలు పొంగిపొర్లుతు న్నాయని స్థానికులు వాపోతున్నారు. తమ ఇళ్లు, ఆస్తులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న నాలాలు ఇప్పుడున్న జనాభాకు అనుగుణంగా లేవని తెలిపారు. వాటిని వెడల్పు చేయడం, పూడిక తీయడం, సామర్థం పెంపుతో పాటు నాలాల ఆక్రమణలు, చెరువుల కబ్జాను అరికట్టడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరుతున్నారు. నాలాల ఆక్రమణల వల్ల వరద ముంపునకు గురైన ఆస్తి, ప్రాణనష్టం జరుగుతుందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేశారు. నాలాల ఆక్రమణలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భారీ వర్షాల కారణంతో 185 చెరువులు పూర్తిస్థాయిలో నిండగా,53 చెరువులు దెబ్బతిన్నాయి. ముందుగా వరద నీరు తొలగించాలని నగరంలోని పలుకాలనీ వాసులు కోరుతున్నారు. మరోవైపు మూసీ నది మహోగ్ర రూపం దాల్చి అనేక ప్రాంతాలపై విరుచుకుపడ్డ సంగతి తెలిసిందే. హైదరాబాద్ చరిత్రలో రెండో అతి పెద్ద వాన కాగా,1908 తర్వాత హైదరాబాద్ నగరంలో తొలిసారి ఇంత భారీస్థాయిలో వర్షం పడటం ఇదే తొలిసారి కావడం గమనార్హం. పెద్ద ఎత్తున ఆస్తి, ప్రాణ నష్టం జరిగింది. తెలంగాణ వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ ఎత్తున పంట నష్టం జరిగింది. సుమారు 70 మంది ప్రజలు వరదల కారణంగా మృతి చెందారు. 37 వేల కుటుంబాలు ముంపు బారిన పడ్డాయి. ఎపిలోనూ అనేక జిల్లాలు వరదగుప్పిట్లో ఉన్నాయి. ఎక్కడక్కడే అనేక గ్రామాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. లక్షల మంది జనం తీవ్రంగా ప్రభావితమయ్యారని అంచనా. ఇళ్లు నీటమునిగి, బట్టలు, తిండి గింజ లు కొట్టుకుపోయి నష్టపోయారు. ఇళ్లు వరద నీటిలో మునిగిపోగా సాయం కోసం బాధితులు ఆర్తనాదాలు చేస్తున్నారు. ఈ ఆపద సమయంలో అండగా ఉండాల్సిన ప్రభుత్వం మొత్తం గాలికి వదిలేసింది. అసలు కష్టమే లేదన్నట్టు ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. దీంతో నగరాలు, పట్టణాలు, గ్రామాల్లో ముంపు నీటి బాధితులు సాయం కోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు. నిత్యావసరాలు, అత్యవసరాలు తీర్చుకోవడానికి పట్టణాల్లో పడవల్లో తిరుగుతున్నారు. బాధితులు బయటకు వచ్చే పరిస్థితి లేదు. వీరికి ఆహార సామగ్రి, భోజనం ప్యాకెట్లు అందించాల్సిన అధికారులు అదేదీ పట్టించుకోలేదు. ఎమ్మెల్యే, కలెక్టర్, మంత్రులు కనీసం పరామర్శకు వెళ్లకపోవడంతో జనం మండిపడు తున్నారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో పండగ వేళ వారిని ఓదార్చే వారు కరువయ్యారు. ఇంతటి విషాదం నెలకొన్న వేళ యుద్ధప్రాతిపదికన చర్యలకు దిగి ఉంటే సమస్యలు తగ్గకున్నా స్వాంతన కలిగేది.

నిలకడగా నటుడు రాజశేఖర్ ఆరోగ్యం

చికిత్సకు స్పందిస్తున్నారని ఆసుపత్రి బులిటున్ విడుదల

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన చిరంజీవి

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): సినీనటుడు రాజశేఖర్ ఆరోగ్యం నిలకడగానే ఉందని సిటీ న్యూరో సెంటర్ ఆసుపత్రి వెల్లడించింది. కరోనా కారణంగా రాజశేఖర్ తమ ఆసుపత్రిలో చేరినట్టు పేర్కొన్న సిటీ న్యూరోసెంటర్.. ఆయన ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ గురువారం ఉదయం బులిటెన్ విడుదల చేసింది. రాజశేఖర్ ప్రస్తుతం ఐసీయూలో ఉన్నారని, వెంటిలేటర్ సపోర్టు లేకుండానే చికిత్సకు స్పందిస్తున్నారని ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ రత్నకిశోర్ తెలిపారు. ఆసుపత్రి నుంచి ప్రకటన వెలువడకముందు ఆయన చిన్న కుమార్తె శివాత్మిక సామాజిక మాధ్యమాల్లో తన తండ్రి ఆరోగ్య పరిస్థితిని వివరిస్తూ ప్రకటన చేసింది. కొవిడ్ నుంచి కోలుకునేందుకు నాన్న తీవ్రంగా పోరాటం చేస్తున్నారని పేర్కొంది. కరోనా నుంచి నాన్న వేగంగా కొలుకోవాలని అభిమానులు ప్రార్థించాలని విజ్ఞప్తి చేసింది. శివాత్మక ప్రకటనతో రాజశేఖర్ ఆరోగ్యంపై గందరగోళం నెలకొన్న నేపథ్యంలో మరోమారు తన తండ్రి ఆరోగ్య పరిస్థితిని పేర్కొంటూ... రాజశేఖర్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, వదంతులు నమ్మవద్దని విజ్ఞప్తి చేసింది. కరోనాతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజశేఖర్‌కు సంబంధించి తాజాగా హెల్త్ బులిటెన్ విడుదలైంది. రాజశేఖర్ ఆరోగ్యం నిలకడగానే ఉందని, చికిత్సకు స్పందిస్తున్నారని వైద్యులు తెలిపారు. అలానే తన తండ్రి క్షేమంగా రావాలని , ఇందుకోసం అందరు ప్రార్థనలు చేయండని శివాత్మిక చేసిన ట్వీట్‌కు చిరంజీవి స్పందించారు.

డియర్ శివాత్మిక .. మీ నాన్న, నా స్నేహితుడు రాజశేఖర్ త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నా. ధైర్యంగా ఉండండి. అందరి ప్రార్థనలతో రాజశేఖర్ త్వరగా కోలుకుంటారు. మీ కుటుంబం కోసం ప్రార్థిస్తున్నాను అని చిరు తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఉదయం తన తండ్రి ఆరోగ్యం గురించి ట్వీట్ చేసిన శివాత్మిక.. నా తండ్రి కరోనాతో ధైర్యంగా పోరాడుతున్నారు. మీ ప్రార్థనలు, ప్రేమ, మద్దతు మమ్మల్ని కాపాడతాయని మేం బలంగా నమ్ముతున్నాం. నాన్న త్వరగా కోలుకోవాలని మీరందరూ దయచేసి ప్రార్థనలు చేయండి. మీ ప్రేమతో ఆయన క్షేమంగా తిరిగి వస్తార'ని శివాత్మిక పేర్కొంది. మరో ట్వీట్‌లో అతని ఆరోగ్యం క్రిటికల్‌గా ఏమి లేదు. ఆరోగ్యానికి స్పందిస్తున్నారు. దయచేసి తప్పుడు వార్తలను ప్రచారం చేయొద్దు. అందరు ధైర్యంగా ఉండండి అని శివాత్మిక పేర్కొంది.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

కాత్యాయినిగా అభయమిచ్చిన భద్రకాళి

వరంగల్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వరంగల్ భద్రకాళి ఆలయంలో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరోరోజు అమ్మవారు కాత్యాయని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాత్యాయని త్రిమూర్తుల తేజంతో అలరారుతుందీ దేవి రూపం. మహిషాసురుణ్ణి సంహరించడానికి ఎత్తిన ఈ అవతారాన్ని ముందుగా కాత్యాయనుడు అనే ముని పూజించడం వల్ల ఈమెకీ పేరు వచ్చింది. నాలుగు చేతులున్న తల్లి వాహనం సింహం. ఒక చేతిలో ఖడ్గం, రెండో చేతిలో కమలం ధరించి దర్శనమిస్తారు. మిగిలిన రెండు చేతులూ వరద ముద్ర, అభయ హస్తంగా ఉంటాయి. కష్టాలు బాధలు తీరాలనే కోరికతో ఈ రూపంలో పూజిస్తారు. ప్రకృతికి ప్రతీక అయిన ఆకుపచ్చ రంగులో దర్శనమిచ్చే తల్లిని పసుపు రంగు వస్త్రాలతో అలంకరిస్తారు. కాత్యాయనిగా దర్శనమిచ్చిన భద్రకాళి అమ్మవారిని భక్తులు దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు కాళరాత్రి అలంకారంలో భక్తులను అనుగ్రహించనున్నారు. కరోనా నేపథ్యంలో పరిమిత సంఖ్యలో భక్తులకు అనుమతించారు.

బాసరలోనూ కాత్యాయినిగా జ్ఞానసరస్వతి

శారదీయ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన గురువారం బాసర జ్ఞాన సరస్వతీ దేవి అమ్మవారు కాత్యాయని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెలంగాణ రాష్ట్ర ఎస్ఐబీ (స్పెషల్ ఇంటిలైజన్సీ బ్యూరో) ఐజీ ప్రభాకర్ రావు అమ్మవారిని కుటుంబ సమేతంగా విచ్చేసి దర్శించుకున్నారు. తన మనుమరాలు అనిక రావుకి అక్షరాభ్యాసం చేయించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదాలతో స్వాగతం పలికి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజా చేయించి ఆశీర్వచనం అందించారు.

భద్రాచలంలో లొంగిపోయిన మహిళా మావోయిస్ట్

-మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలన్న ఎఎస్పీ

భద్రాచలం,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): భద్రాచలం పోలీసుల ఎదుట మహిళా మావోయిస్టు గురువారం లొంగిపోయింది. ఐదేళ్లుగా మావోయిస్టు దళంలో పని చేస్తున్న కలుమాదేవి అనే మావోయిస్టు జనజీవన స్రవంతిలో కలిసిపోయింది. ఈ సందర్భంగా ఏఎస్పీ రాజేశ్ చంద్ర మీడియాకు వివరాలు వెల్లడించారు. కలుమాదేవి 2014లో సీపీఐ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై ప్రకాశ్ ఏరియా కమిటీలో చేరింది. పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంది. 2016 నుంచి 17 వరకు మావోయిస్టు చర్ల నాయకత్వంలో గార్డుగా పని చేసింది. 2017 నుంచి 2019 వరకు శబరి కమాండర్‌గా కొనసాగింది. 2019-20 మధ్య కొంతకాలం శబరీ ఐసీ కమాండర్‌గా పని చేసింది. మావోయిస్టు పార్టీ సిద్ధాంతాలు నచ్చక, పార్టీలో పని చేయడానికి ఆసక్తి లేక జనజీవన స్రవంతిలో కలవాలని పార్టీ నుంచి బయటకు వచ్చింది. లొంగిపోయినందుకు ప్రభుత్వం నుంచి రావాల్సిన రివార్డును కలుమాదేవికి ఇప్పిస్తామని ఏఎస్పీ హామీ ఇచ్చారు. అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు సైతం జనజీవన స్రవంతిలో కలవాలని సూచించారు.

అస్తమించిన కార్మిక లోక సూరీడు

ఆరడుగుల ఆజానుబాహుడు, పేదల పక్షపాతి, కార్మికలోక సూరీడు, భోళాశంకరుడు, నిజమైన సోషలిస్ట్, 86 ఏళ్ళ రాష్ట్ర మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి మరణాన్ని తెలంగాణ ప్రజానీకం జీర్ణించుకోలేక పోతున్నారు. ఇటీవల కోవిడ్-19 బారినపడి కోలుకున్న దశలో నిమోనియ సోకి (22 అక్టోబర్ 12:25 ఏయం) తుది శ్వాస విడవడం అత్యంత విచారకరం. నల్గొండ జిల్లా చందంపేట మండలం నేరేడుగొమ్మ గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో దేవయ్య రెడ్డి సుభద్రమ్మలకు 12 మే 1934 నాడు జన్మించిన నాయిని నర్సింహారెడ్డి 12వ తరగతి వరకు చదువుకున్నారు. విద్యార్థి దశలోనే ప్రగతిశీల భావాలతో నాయకత్వ లక్షణాలను పునికి పుచ్చుకొని, 26 జనవరి 1958లో సోషలిస్ట్ పార్టీలో సభ్యత్వం తీసుకున్నారు. తన కార్యదక్షతతో పార్టీలో గుర్తింపును పొంది అనతికాలంలోనే చురుకైన కార్యకర్తగా ఎదిగి, 1962లో సోషలిస్ట్ పార్టీ హైదరాబాద్ కార్యాలయ కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. పార్టీ సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర కార్యదర్శిగా పదోన్నతులు పొందుతూ, కార్మిక ఉద్యమాలకు నాయకత్వం వహించడం ప్రారంభించారు. 1969లో జరిగిన తొలి దశ తెలంగాణ ఉద్యమంలో పని చేశారు. కార్మిక పక్షపాతిగా హమాలీ, తోపుడు బండ్ల శ్రామికుల పెద్దన్నగా సమస్యల సాధనకు ఉద్యమించారు. ట్రేడ్ యూనియన్ నాయకుడుగా వియస్‌టీ, ఐడియల్, మోడ్రన్ బేకరీ, గంగప్ప కేబుల్స్, హెచ్‌యంటీ లాంటి కంపెనీల్లో కార్మిక నేతగా అవిశ్రాంత సేవలు అందించారు. సికింద్రాబాద్ హాకర్స్ అసోసియేషన్ మరియు మునిసిపల్ వర్క్స్ యూనియన్ అధ్యక్షుడిగా ఎన్నికై, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. హిందూ మజ్దూర్ సంఘం గౌరవ అధ్యక్షుడిగా పని చేస్తూనే అమరుడైనారు. తదనంతరం జనతా పార్టీలో చేరి 1999 వరకు పని చేశారు. 1975 ఎమర్జన్సీ కాలంలో 18 మాసాలు ముషీరాబాద్ జైలులో నిర్బంధించబడ్డారు. 1978లో జరిగిన రమిజాబీ కేసును వెలుగులోకి తెచ్చి, ముస్లిం మహిళపై జరిగిన అత్యాచారానికి, బాధితుల పక్షాన నిలబడి సుదీర్ఘంగా పోరాడి న్యాయం అందించే ప్రయత్నం చేసి అందరి మన్ననలు పొందారు.

(ప్రజానాయకుడు నాయిని నర్సింహారెడ్డికి అక్షరనివాళి)

కార్మికలోకం విసిరిన ఆజానుభాహుడు, ఆరడుగుల బులెట్ మన ప్రియతమ నాయిని నర్సింహారెడ్డి. మీసాల గాంభీర్యంతో బులెట్ వాహనంపై తిరుగుతూ బడుగులకు ఆత్మీయుడిగా, కుటుంబ పెద్దగా కొనియాడబడినారు. తెల్లటి పంచె, అంగి మరియు హాఫ్ కోటు ధరించే నాయిని, సాధారణ జనం నాలుకగా నిలిచారు. తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో సున్నిత మనస్తత్వం, భోళాతనం, నిష్కల్మషత్వం, నిస్వార్థత, సాదాసీదా సరళ జీవితంతో ప్రజలకు ఆప్తుడిగా పేరుతెచ్చుకున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ప్రవేశమే ప్రభంజనంతో అడుగిడినారు మన నాయిని నర్సింహారెడ్డి. 1978లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీచేసి అప్పటి కార్మిక మంత్రి టి అంజయ్యను ఓడించి చరిత్ర సృష్టించారు. అనంతరం మరో కార్మిక మంత్రి జి సంజీవరెడ్డిని కూడా ఓడించి జెయింట్ కిల్లర్‌గా పేరు తెచ్చుకున్నారు. 2004లో 3వ సారి యంయల్‌ఏగా ఎంపికై సాంకేతిక విద్యాశాఖ మంత్రిగా (2004 - 2008) సేవలందించారు. రాష్ట్ర కెబినెట్ నుంచి టిఆర్‌యస్ వైదొలగిన సమయంలో అమెరికా నుండే రాజీనామా పత్రం సమర్పించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనలో 2001 నుంచి క్రియాశీలతతో పోరాటం చేస్తూ, కెసిఆర్‌కు వెన్నుదన్నుగా నిలిచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత గవర్నర్ కోటాలో యంయల్‌సిగా నియమించబడి, తొలి హోంమంత్రిగా (2014 - 2018) మరియు కార్మికశాఖ మంత్రిగా బాధ్యతలు సమర్థవంతంగా చేపట్టారు. మీసాల ధీరుడు నర్సింహారెడ్డి మరణం భార్య అహల్యారెడ్డి, సంతానం దేవేందర్ రెడ్డి మరియు సమతారెడ్డిలకు తీరని లోటును మిగ్చింది. అల్లుడు ప్రస్తుతం హైదరాబాద్‌లో జిహెచ్‌యంసీ కార్పొరేటర్‌గా సేవలు అందిస్తున్నారు. టిఆర్‌యస్ పోలిట్ బ్యూరో సభ్యుడిగా తుది శ్వాస విడిచే వరకు పార్టీకి మరియు ప్రజలకు అనితర సాధ్యమైన ప్రజాసేవలతో మనసులు దోచుకున్నారు. కపటం తెలియని, నిరాడంబర ఆదర్శ జీవితం వారి సొంతం. పెద్ద చదువులు చదవక పోయినా, పెద్ద మనసుతో మేధావులను కూడా మెప్పించిన అపురూప వ్యక్తిత్వం కలిగిన మహా ప్రజానాయకుడు మీసాల వీరుడు, ఆరడుగుల బులెట్ నాయిని నర్సింహారెడ్డి జీవితం నేటి యువతకు ఆదర్శం కావాలి. వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి తెలుగు ప్రజల పక్షాన ప్రగాఢ సానుభూతి తెలుపుదాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

నాయినికి టిఆర్ఎస్ ఘన నివాళి

ఖమ్మం,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): కార్మిక సంఘం నాయకుడిగా జీవితాన్ని ప్రారంభించిన టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఉద్యమ నేత నాయిని నర్సింహారెడ్డి మరణం అత్యంత బాధాకరమని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. గురువారం ఖమ్మం టీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఆయన 2001లో నాటి ఉద్యమ సారథి, సీఎం కేసీఆర్ నాయకత్వానికి ఆకర్షితులైన తెలంగాణ సాధన కోసం మలి ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని తెలిపారు.

ఉద్యమ నేతను కోల్పోయామన్న పువ్వాడ

పార్టీలో నాయిని నర్సింహారెడ్డికి కేసీఆర్ అన్ని వేళలా అత్యున్నత స్థానం కల్పించారని తెలిపారు. వారి మృతి పార్టీకి తీరని లోటన్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాత మధు , మేయర్ పాపాలాల్, సుడా చైర్మన్ విజయ్ కుమార్, రైతు సమన్వయ సమితి జిల్లా కో ఆర్డినటర్ నల్లమల వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు మురళి, ఊట్కూరి లక్ష్మి సుజాత, నాయకులు ఉన్నారు.

వీసా నిబంధనలు సడలించిన కేంద్రం

హైదరాబాద్, అక్టోబర్ 22: కేంద్ర ప్రభుత్వం ఇవాళ వీసా నిబంధనలను సడలించింది. అన్ని వర్గాల విదేశీయులు భారత్‌లోకి ప్రవేశించేందుకు అనుమతి ఇచ్చారు. అయితే పర్యాటకం కోసం భారత్‌లో విజిట్ చేసేందుకు విదేశీయులకు అనుమతి ఇవ్వలేదు. ఓసీఐ, పీఐఓ కార్డులు ఉన్నవారితో పాటు విదేశీయులకు ఈ అవకాశం కల్పించారు. దీనికి సంబంధించి ఇవాళ కేంద్ర హోంశాఖ ఓ ప్రకటన జారీ చేసింది. భారతీయులతో పాటు విదేశీయులకు కూడా ప్రయాణ ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు తెలిపారు. పౌర విమానయానశాఖ ఆమోదించిన విమానాలకు మాత్రమే ఈ ఆంక్షలు వర్తించనున్నాయి. కోవిడ్ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్యశాఖ జారీ చేసిన నిబంధనలను కచ్చితంగా పాటించాల్సి ఉంటుంది. ఎలక్ట్రానిక్, టూరిస్ట్, మెడికల్ వీసాలు తప్ప ఇతర అన్ని వీసాలను పునరుద్ధరిస్తున్నట్లు భారత ప్రభుత్వం పేర్కొన్నది. తాజా ఆదేశాలతో... బిజినెస్, కాన్ఫరెన్స్, ఉద్యోగం, విద్య, పరిశోధన, వైద్య సంబంధిత విషయాలకు హాజరయ్యేందుకు విదేశీయులకు అనుమతి ఇచ్చారు.

కరోనా వేళ భారీగా పెరిగిన మందుల ధరలు

30నుంచి 40 శాతం వరకు ఔషధాలపై వడ్డింపు

పెరిగిన ధరలను పట్టించుకోని ప్రభుత్వాలు

న్యూఢిల్లీ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): కరోనా స్వారీ చేస్తున్న వేళ ప్రజలు సొంత వైద్యానికి అలవాటు పడ్డారు. విటమిన్లు, జలుబు దగ్గు మందులు సొంతగా వాడుతున్నారు. ప్యారాసిటమల్ సహా అనేక మందులను తమకు తోచిన విధంగా వినియోగిస్తున్నారు. దీంతో ఇదే అదనుగా మెడికల్ షాపుల్లో అనేకానేక మందులు దర్శనమిస్తున్నాయి. మెడికల్ షాపుల వారే ఫలానా మందులు వేసుకోమని సలహాలు ఇస్తున్నారు. తుమ్మినా దగ్గినా మెడికల్ షాపుకు పరుగెత్తే కాలం వచ్చింది. మొత్తంగా గత ఆరు నెలల కింది పరిస్థితులతో పోలిస్తే ఇప్పుడు ..వివిధ రకాల మందులు, టానిక్‌ల ధరలు విపరీతంగా పెరిగాయి. కనీసం 30నుంచి 40శాతం ధరలు పెంచేసారు. దీన్ని నివారించడానికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. జనరిక్ ఔషధాలను అందుబాటులోకి తేవడం, మందుల పేర్లను స్పష్టంగా రాయడం వంటి ఆదేశాలు ఉన్నా అవి అమలు కావడం లేదు. గ్రామాల్లో అసలు ఈవిషయాలు తెలియక పోవడంతో అమాయకులు దోపిడీకి గురవుతున్నారు. జెనరిక్ మందులను ప్రోత్సహిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గతంలో ఇచ్చిన హామీ మేరకు ఎంసీఐ ఆదేశాలను జారీ చేసినా జనరిక్ షాపుల ఏర్పాటు జరగడం లేదు. జనరిక్ మందులు అందుబాటులోకి వస్తే దాదాపుగా రోగికి సగం ఖర్చుల భారం తగ్గుతంది. కానీ ఆ దిశగా ప్రయాత్నాలు సాగడం లేదు. కనీసం ప్రభుత్వ ఆస్పత్రులకు అనుబంధంగా వీటిని అందుబాటులోకి తీసుకుని రావాలి. వైద్యులు వీటినే రాసేలా కఠిన చర్యలు తీసుకోకపోతే ప్రజలకు నష్టం తప్పేలా లేదు. అలాగే ప్రైవేట్ వైద్యులపై కఠిన చర్యలు కూడా ఉండాలి. కానీ ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. పెద్ద ఔషధ సంస్థలు వారి ఉత్పాదనలకు ఆకర్షణీయమైన పేర్లు పెట్టుకొని ప్రచార ప్రకటనలకు భారీగా వ్యయం చేసి,తమ బ్రాండ్ మందులను అత్యధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాయి. దీని కోసం పలు సంస్థలు వాటిని ఎక్కువగా విక్రయించడానికి మెడికల్ ఎగ్జిక్యూటివ్‌లను నియమించుకొని వారితో వైద్యుల వద్ద విస్తృత ప్రచారం చేయిస్తున్నారు. తమ మందులు విక్రయింపచేస్తే కొంత శాతం నగదు నజరానా ఇస్తామని, విదేశీ పర్యటనలు ఉంటాయని లేదా విలువైన వస్తువులు అందచేస్తామని, స్కీంలు ఎరచూపి వైద్యులతో తమ సంస్థ మందులు విక్రయమయ్యేలా చేస్తున్నారు. వీటికి కొందరు వైద్యులు ఆకర్షితులై వాటినే ప్రోత్సహిస్తు న్నారు. కమిషన్‌తో పాటు,బహుమతుల రూపంలో భారీగా లాభం చేకూరు తుండటంతో వైద్యులు సైతం వాటి వినియోగానికే ప్రాధాన్యమిస్తున్నారు. ప్రాణాలతో చెలగాటం ఎందుకని భయపడి వైద్యులు ఏవి సూచిస్తే వాటినే రోగులు విధిలేక వాడుతున్నారు. మరోవైపు నర్సింగ్ హోంలు, ఆసుపత్రులు నిర్వహించే వైద్యులందరికి దాదాపుగా వారి సొంత దుకాణాలే ఉన్నాయి. జెనరిక్ ఔషధాల విక్రయం వల్ల తక్కువ లాభం వస్తుందని.. వాటిని ప్రోత్సహించటానికి ఆసక్తి చూపడం లేదు. పెద్ద ఔషధ కంపనీలు భారీగా ప్రకటనలతో పాటు తమ ఉత్పాదనలను విక్రయించుకోవడానికి వైద్యులకు భారీగా నజరానాలు ప్రకటిస్తూ రోగులను ఆర్థికంగా దివాలా తీయిస్తున్నాయి. మార్కెట్‌లో లభించే మందులతో పోలిస్తే జెనరిక్ మందులపై 40 నుంచి 80 శాతం తక్కువ ధరకు లభిస్తాయి.సామాన్యులకు తక్కువ ధరకు మందులను అందించే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేయడానికి ఆమోద ముద్ర వేసింది. ఈ మేరకు ఈ దుకాణాల్లో తక్కువ ధరకే దాదాపు 700 రకాలను అందుబాటులో ఉంచారు. బ్రాండెడ్ కంపెనీల మందులు, జెనరిక్ ఔషధ ధరల్లో భారీగా తేడా ఉంటుంది. జెనరిక్ ఔషధాల్లో వాడిన మూలకమే స్వదేశీ, విదేశీ కంపేనీల ఉత్పత్తిదారులు వాడుతారు. ఈ రెండింటిలోనూ మూలకం ఒక్కటే ఉంటుంది.. ధర మాత్రమే తేడా.

రెండేళ్ల వరకు వ్యాక్సిన్ కష్టమే

-బూస్టర్‌ను సిద్ధం చేశామన్న సిసిఎంబి డైరెక్టర్

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): మరోరెండేళ్ల వరకు కరోనా వైరస్‌కు వ్యాక్సిన్ వచ్చే అవకాశం లేదని సీసీఎంబీ డైరెక్టర్ రాకేష్ మిశ్రా అన్నారు. భారతదేశంలో కరోనా వైరస్ తగ్గిపో

అంగరంగ వైభవంగా గౌరీ దేవి శోభాయాత్ర..

అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన మున్సిపల్ పాలకవర్గం

రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 22 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ లో సద్దుల బతుకమ్మ వేడుకలకు సర్వం సిద్ధమైంది.. మున్సిపల్ కార్యాలయంలో గౌరీ మాత విగ్రహాన్ని అధ్యక్షురాలు రామతీర్థపు మాధవి రాజు ఆధ్వర్యంలో పాలకవర్గం సభ్యులు గౌరీ దేవి అమ్మవారిని ఊరేగింపుగా బతుకమ్మ ఘాట్ వద్దకు తీసుకువచ్చి ప్రతిష్టించారు.

ఈ సందర్భంగా మున్సిపల్ అధ్యక్షురాలు రామతీర్థపు మాధవి రాజు మాట్లాడుతూ గురువారం డోలు కళాకారులతో మేళతాళాల మధ్య ప్రత్యేకమైన వాహనంలో గౌరీదేవి అమ్మవారి విగ్రహాన్ని శోభయాత్ర గా బతుకమ్మ ఘాట్ లో ప్రతిష్టించినట్లు తెలిపారు. అనంతరం అమ్మవారికి పూలమాలలు వేసి ప్రత్యేకమైన పూజలు జరిపామన్నారు. వేములవాడ నియోజకవర్గ గౌరవ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు పట్టణ ప్రజలకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారన్నారు. 19 నిబంధనల మేరకు ప్రతి ఒక్కరూ భౌతిక దూరం పాటిస్తూ పండుగ జరుపుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మట్ట శ్రీనివాస్ రెడ్డి. కౌన్సిలర్లుజెమిని శ్రీనివాస్ మారం కుమార్ . బింగి మహేష్, గోలి మహేష్,ఇప్ప పుల్ల అజయ్ , నరాల శేఖర్ , నిమ్మ శెట్టి విజయ్, ముప్పిడి సునంద కొండ పావని కొండ శ్రీలత అన్నారం ఉమారాణి రామతీర్థ కృష్ణవేణి టిఆర్ఎస్ నాయకులు పులాస నరేందర్ ,కొండ కనకయ్య అన్నారం శ్రీనివాస్ కో ఆప్షన్ మెంబర్లు కట్కూరి శ్రీనివాస్ . సర్వర్ అలీ ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి...

-జడ్పిటిసి నాగం కుమార్

రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 22 (నేటినిజం ప్రతినిధి):నిరుపేదలు కళ్యాణ లక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని చందుర్తి జడ్పిటిసి సభ్యులు నాగం కుమార్ అన్నారు, చందుర్తి మండల కేంద్రంలో 69 మంది లబ్ధిదారులకు 69 లక్షల ఎనిమిది వేల రూపాయల చెక్కులను గురువారం సింగిల్విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పొన్నాల శ్రీనివాసరావు తో కలిసి పంపిణీ చేశారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని నిరుపేదలు కళ్యాణ లక్ష్మి పథకం సద్వినియోగం చేసుకొని అప్పుల ఊబి నుండి ఉపశమనం పొందాలన్నారు, కొన్ని గ్రామాల్లో నిరుపేదలను నిరక్షరాస్యులను ఆసరా చేసుకొని దళారులు కళ్యాణ లక్ష్మి పథకంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు, దళారుల జోక్యం లేకుండా నేరుగా లబ్ధిదారులకు చెక్కులను అందే విధంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పిటిసి కోరారు, ఈ కార్యక్రమంలో కే డిసిసిబి డైరెక్టర్ జలగం కిషన్ రావు, తాహసిల్దార్ డి, నరేష్, టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మరాటి మల్లిక్, సర్పంచ్ లు లింగంపల్లి కర్ణాకర్, లింగంపల్లి సత్తయ్య, లక్ష్మీనారాయణ, ఎంపీటీసీలు మ్యాకల గణేష్. దారం కావ్య శ్రీ నాయకులు బత్తుల కమలాకర్, దేవ స్వామి,న్యాత జార్జీ ఈర్లపల్లి రాజు, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు,

ఫర్నిచర్ వితరణ

రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 22 (నేటినిజం ప్రతినిధి): వేములవాడ నృత్య కళానికేతన్ సేవా సంస్థ ప్రధాన కార్యాలయం నందు సంస్థ ఉపాధ్యక్షుడు శ్రీ గణాచారి మటం సాంబ శివ సంస్థకు 20 కుర్చీలు,ఒక ఆఫీస్ టేబుల్ ను అందజేసి వారి ఉదారతను చాటుకున్నారు . వితరణ చేసిన సాంబ శివ కి నృత్య కళానికేతన్ సేవా సంస్థ వారు కృతజ్ఞతలు తెలిపారు .ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ ఎ ల్ల పోశెట్టి ,సంస్థ గౌరవ అధ్యక్షులు సామినేని బాలు,అధ్యక్షులు గంగా శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి మానువాడ లక్ష్మి నారాయణ ,కార్యవర్గ సభ్యులు ఎర్ర రవి రాజు ,బొడిగె రాజు, కోయినేని శ్రీపతి, అనిల్ పాల్గొన్నారు.

నోట్స్ బుక్స్ దుస్తులు పంపిణీ చేసిన సర్పంచ్ ఎంపీటీసీ

రాజన్న సిరిసిల్లా, అక్టోబర్ 22 (నేటినిజం ప్రతినిధి):వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకుబుధవారం ఉచిత నోట్ బుక్స్ ,దుస్తులను సర్పంచ్ ఊరిడి రామ్ రెడ్డి,ఎం పి టి సి గాలి పెల్లి సువర్ణ స్వామి గౌడ్ పంపిణీ చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడెం శ్రీనివాస్ ,విద్యా కమిటీ చైర్మన్ గాలి పెల్లి శ్రీధర్ గౌడ్ ,సింగిల్ విండో డైరెక్టర్ కట్ట శ్రీనివాస్ గౌడ్ , గో నె భాస్కర్ ,వార్డు సభ్యులు బెజ్జగమ్ మహేష్,తునికి కనకరాజు, నడిగట్ల సప్న, హరికృష్ణ, అనుముల కావ్య,భరత్ కో ఆప్షన్ సభ్యులు జిల్లా కృష్ణమూర్తి ,ప్రధాన పాధ్యాయులు భూమయ్య ,ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు

ఇంద్రకీలాద్రిపై వైభవంగా శరన్నవరాత్రులు

లలితా త్రిపురసుందరిగా అమ్మవారి దర్శనం
అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు

విజయవాడ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతు న్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు గురువారం అమ్మవారు లలితా త్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిస్తున్నారు. తెల్లవారుజామున 5 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు.

కోవిడ్ నిబంధనల మధ్య దసరా ఉత్సవాలు జరుగుతున్నాయి. నవరాత్రి మహోత్సవాల్లో ఆరో రోజున విజయవాడలో ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మ వారు శీ లలితా త్రిపుర సుందరీదేవిగా దర్శనమిస్తున్నది. దేవీ ఉపాసకులకు ఈ తల్లి ప్రధాన దేవత. త్రిగుణాతీతమైన కామేశ్వర స్వరూపం ఆమెది.

లక్ష్మీసరస్వతులు ఇరువైపులా ఉండి వింజామరలు వీస్తుండగా శ్రీచక్ర అధిష్ఠాన శక్తిగా కొలువై ఉంటుంది. పంచదశాక్షరీ మహామంత్రాధిదేవతగా వేంచేసి తనని కొలిచే భక్తులను, ఉపాసకులను అనుగ్రహిస్తుంది.

త్రిపురా త్రయంలో రెండో స్వరూపం లలితాదేవి. ఆమె కామేశ్వరుని వివాహమాడింది. ఆ ఆదిదంపతులు ఈ సకల సృష్టిని నిర్వర్తిస్తు న్నారు. శ్రీలలిత త్రిపుర సుందరీదేవి సకల దేవీ స్వరూపాలకు మూల రూపం.

12.నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లలితా పరమేశ్వరిగా దర్శనమిచ్చిన బెజవాడ కనకదుర్గమ్మ

ఘోరమైన దారిద్య్ర బాధల నుంచి ఉపశమనాన్ని కలిగించి మహదైశ్వర్యాన్ని ప్రసాదించే తల్లి శ్రీలలితాదేవి. ఆమెవిద్యా స్వరూపిణి. సమస్త సుఖాలు ప్రసాదించే శక్తి స్వరూపిణి అనీ, మాంగల్య సౌభాగ్యాన్ని ప్రసాదిస్తుందనీ విశ్వాసం.

అమ్మవారు 'అరుణ' వర్ణంలో ప్రకాశిస్తూ చతుర్భుజాలతో- పాశము, అంకుశము, పుష్పబాణాలు, ధనుస్సు ధరించి, అణిమాది సిద్ధులు కిరణరూపంగా చుట్టూ ప్రకాశిస్తుండగా అపార కరుణా దృష్టితో దర్శనమిస్తుంది. ఆమె సకల దేవీ శక్తులకు మూల స్వరూపం. కాబట్టి ఏ అమ్మవారిని కొలిచినా లలితా సహస్ర నామంతో పూజిస్తారు. లలితాదేవి దర్శనం, సేవల వల్ల ఆయురారోగ్యాలు, సకాలంలో వివాహం, సౌభాగ్యం, వంశాభివృద్ధి, అభీష్ట సిద్ధి, ముక్తి కలుగుతాయని భక్తుల నమ్మిక. త్రిమూర్తులు, సకల దేవతలు ఆమెను కొలుస్తారనీ, ఆమెను ఆరాధించిన వారికి ఎల్లప్పుడూ సుఖ సౌఖ్యాలు కలుగుతాయనీ పురాణాలు చెబుతున్నాయి.

తిరుమలలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన శ్రీవారు

తిరుమల,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం ఉదయం స్వామి వారు శ్రీవారి ఆలయంలో కల్యాణోత్సవ మండపంలో మలయప్పస్వామి త్రివిక్రమ అలంకారంలో దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజు ఉదయం సూర్యనారాయణుడు సూర్యప్రభామధ్యస్థుడై దివ్యకిరణ కాంతుల్లో ప్రకాశిస్తూ సూర్యప్రభ వాహనంలో దర్శనమిచ్చారు. సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకృతికి చైతన్యప్రదాత.

ఈ ఉత్సవంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్యప్రభ, సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యుని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. ఇంతటి మహాతేజఃపూర్ణమైన సూర్యప్రభ వాహనంలో ఉండే సూర్యనారాయణుడిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి. స్వామి వారు రాత్రి 7 గంటలకు చంద్రప్రభ వాహనంపై భక్తులను అనుగ్రహించనున్నారు.

ఆంధ్రప్రదేశ్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి వాహనసేవలో పాల్గొన్నారు. అదనపు ఈవో ధర్మారెడ్డి, బోర్డు సభ్యులు శేఖర్‌రెడ్డి, డాక్టర్ నిశ్చిత, చిప్పగిరి ప్రసాద్, కార్యక్రమంలో పెద జీయర్‌స్వామి, చినజీయర్‌స్వామి, ఈవో జవహర్‌రెడ్డి, గోవింద హరి, డీపీ అనంత, సీవీఎస్‌ఓ గోపినాథ్ జెట్టి పాల్గొన్నారు.

ఉల్లి ధరలు ధారికి వచ్చేనా?

కేంద్రం చర్యలతో ఫలితం దక్కేనా

న్యూఢిల్లీ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): ఉల్లిగడ్డల ధరలు అనూహ్యంగా పెరగడంతో దిగుమతులపై ఆంక్షలు సడలిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విదేశాల నుంచి దిగుమతులను వేగంగా దేశీయ మార్కెట్లకు చేర్చడం ద్వారా పెరిగిన ధరలను అదుపులో పెట్టొచ్చని కేంద్రం భావిస్తోంది. తాజా పరిస్థితిపై వినియోగదారుల మంత్రిత్వశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ఏడాది డిసెంబర్ 15 వరకు ఉల్లిగడ్డల దిగుమతులపై సడలింపులు అమలవుతాయని తెలిపింది. ఉల్లిగడ్డలు ఎగుమతి చేసే దేశాలలోని రాయబారులను ఈ విషయమై అప్రమత్తం చేశామని తెలిపింది. ఆయా దేశాల వ్యాపారులతో సంప్రదించాలని సూచించింది.మరోవైపు ప్రభుత్వ గోదాన్లలో నిల్వ చేసిన బఫర్ స్టాక్‌ను కూడా బహిరంగ మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టనున్నట్టు తెలిపింది. సెప్టెంబంలోనే ఈ నిర్ణయం తీసుకున్నా ఇప్పుడు మరింత వేగంగా మార్కెట్‌లోకి ప్రవేశ పెట్టనున్నట్టు తెలిపింది. పది రోజుల్లో ఉల్లిగడ్డల ధర దేశీయ సగటు కిలోకు రూ.11.56 నుంచి రూ.51.95కు ఎగబాకినట్టు తెలిపింది. ఖరీఫ్‌లో 37 లక్షల టన్నులు దేశీయంగా ఉత్పత్తి కానున్నట్టు అంచనా ఉన్నది. మహారాష్ట్ర, కర్నాటక, మధ్యప్రదేశ్‌లోని ఉల్లిగడ్డలు పండించే ప్రాంతాల్లో భారీ వర్షాలు, వరదల వల్ల నిల్వ, సరఫరాకు ఆటంకాలు ఏర్పడ్డాయని కేంద్రం తెలిపింది. కొద్ది రోజులుగా వర్షాలు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రా, తెలంగాణలపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుండడంతో ఉల్లి సరఫరా ఆగింది. దిగుమతి ఆగడంతో ఉల్లి ఘాటెక్కింది. మున్ముందు ధర అమాంతంగా పెరుగుతూ కన్నీళ్లు పెట్టించే అవకాశాలు ఎక్కువగానే ఉన్నాయి. ధర అమాంతంగా పెరిగి, కిలో రూ.100కు పైనే అమ్ముతున్నారు. ఉల్లి కొన్ని చోట్ల రూ.100, రూ.110 అంటూ ధర పలికింది. అలాగే డిమాండ్‌కు తగ్గ ఉల్లిని దిగుమతి చేయించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రధానంగా ప్రజల్ని ఉల్లి ఘాటు నుంచి గట్టెక్కించేందుకు ఎగుమతులపై ఆంక్షలు తొలగించారు. అలాగే పెరుగుతున్న ఉల్లి ధరను పరిగణించి రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఉల్లి కొనుగోలు చేసి, ప్రజలకు తమ పరిధిలోని దుకాణాల ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ఎవరైనా టోకు వర్తకులు ఉల్లి నిల్వ ఉంచుకుని ఉంటే, చర్యలు తప్పవని హెచ్చరించారు. కేంద్రం తీసుకున్నచర్యల వల్ల ధరలు దారికి వస్తాయా లేదా అన్నది చూడాలి.

మహిళా పోలీసులు అన్నిరకాల సవాళ్ళను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

-కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి

కరీంనగర్, అక్టోబర్ 22 (నేటినిజం ప్రతినిధి):పోలీస్‌శాఖలోని వివిధస్థాయిలకు చెందిన మహిళ అధికారులు అన్నిరకాల సవాళ్ళను ఎదుర్కొనేందుకు మానసికంగా,శారీరకంగా సంసిద్ధంగా ఉండాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహిళ పోలీసులకు ఆసక్తిఉన్న రంగాల్లో అవకాశాలను కల్పించనున్నామని పేర్కొన్నారు.

గురువారం నాడు కమిషనరేట్ కేంద్రంలో పోలీస్ కమిషనర్ విబి కమలాసన్‌రెడ్డి కమిషనరేట్‌లోని అన్నిస్థాయిలకు చెందిన మహిళ పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళాపోలీసులు ఆత్మనూన్యతాభావాన్ని విడనాడి ఆత్మస్థైర్యంతో ముందుకువచ్చి పురుషులతో సమానంగా విధులను నిర్వహించేందుకు పోటీపడాలన్నారు. పోలీస్‌శాఖలో అమలవుతున్న వివిధ విభాగాల్లో మహిళలకు వారిసామర్థ్యాన్ని పరిశీలిస్తూ అవకాశాలను కల్పిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సమర్థవంతమైన సేవలందించాలని చెప్పారు. కార్గిల్‌యుద్ధంలో మహిళ పైలట్ అధికారిణి ధైర్యసాహసాలు ప్రదర్శించిన తీరును ఉదహరిస్తూ ఆకాశమే హద్దుగా మహిళాపోలీసులు ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. పరిమితులు విధించుకుంటే విధినిర్వాహణలో ఏమీసాధించలేమనే విషయాన్ని గుర్తించాలని చెప్పారు. సవాళ్ళతో సహవాసం చేస్తూ సఫలీకృతం అయినప్పుడే సార్థకత లభిస్తుందని పేర్కొన్నారు. వేలమందితోపోటీపడి ప్రజలకు నేరుగా సేవలందించే ప్రభుత్వశాఖల్లో ఒకటైన పోలీసువృత్తిని ఎంచుకోవడం మహిళాపోలీసులు తీసుకున్న సరైన నిర్ణయమని అభినందించారు. జీవితంలో అసాధ్యమంటూ ఏమీఉండదని, అనుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు అంకితభావంతో కృషిచేస్తే సులభంగా చేధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగనియామకాల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్ అమలుచేస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కఠోరమైన విధులను నిర్వహించినప్పుడే ఆశించినస్థాయికన్నా ఎక్కువగుర్తింపు లభిస్తుందనే విషయాన్ని గుర్తించాలని తెలిపారు. పోలీస్‌శాఖ ప్రతిష్టను పెంపొందించేందుకు లభించే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేవారికి శాఖాపరంగా రివార్డులు, ఆవార్డులను అందజేయడంతోపాటు ప్రతిష్టాత్మకమైన వివిధ ప్రభుత్వ పతకాల ఎంపిక కోసం ప్రతిపాదనలు పంపిస్తామని హామీఇచ్చారు. కొన్ని సందర్భాలలో మహిళలు, విద్యార్థినులు పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసే పరిస్థితులు ఉండవని అలాంటి సమస్యలు దృష్టికి వచ్చిన సందర్భంలో ప్రణాళికబద్ధంగా ముందుకుసాగి సదరు సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. సవాళ్ళను ఎదుర్కొనే కొన్నిరకాల విధుల నిర్వాహణను ఎంచుకునే వారికి ప్రత్యేక అలవెన్సులను అందజేస్తామని తెలిపారు. వివిధ స్థాయిలకు చెందిన మహిళపోలీసులు దేహదారుఢ్యాన్ని కాపుడుకోవడం, రోగనిరోధకశక్తిని పెంపొందించుకోవడంతోపాటు మానసికంగా,శారీరకంగా సంసిద్ధంగా ఉండేందుకు వివిధ రకాల వ్యాయామాలను దినచర్యలో భాగంగా అలవర్చుకోవాలని సూచించారు. వృత్తినైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. షీబృందాల్లోని సభ్యులను ప్రతిమూడు నెలలకు ఒకసారి మార్చుచేస్తామని తెలిపారు. మహిళా పోలీసులు ప్రతి విభాగంలోనూ విధులను నిర్వర్తించేలా తీర్చిదిద్దనున్నామని చెప్పారు. ఇకనుండి ప్రతినెలా మహిళా విభాగంలో అత్యుత్తమ సేవలందించే ఎస్ఐ/ఏఎస్ఐ, కానిస్టేబుల్, హెూంగార్డులకు రివార్డులను అందజేయనున్నామని ప్రకటించారు.

హెటిరో డ్రగ్స్ 10కోట్ల సాయం ప్రకటన

-25 లక్షల చెక్కును కెటిఆర్‌కు అందచేసిన నటుడు రామ్

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): హైదరాబాద్‌లోని వరద బాధితులకు హెటిరో డ్రగ్స్ అండగా నిలిచింది. వరద సహాయక చర్యల కోసం భారీ విరాళం ప్రకటించింది. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 10 కోట్లు విరాళం అందించినట్లు హెటిరో డ్రగ్స్ చైర్మన్ పార్థసారథి రెడ్డి వెల్లడించారు. ఇప్పటికే ఆయా రాష్ట్రాలతో పాటు పలువురు పారిశ్రామికవేత్తలు, సినీ ప్రముఖులు సీఎంఆర్ఎఫ్‌కు భారీగా విరాళాలు అందించారు. తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ ఒకరోజు మూలవేతనం సుమారు రూ.33 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేసేందుకు ముందుకొచ్చింది. చిరంజీవి, మహేష్ బాబు, ప్రభాస్, పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్, రామ్, విజయ్ దేవరకొండ తదితరులు తమ వంతు సాయంగా విరాళాలు అందించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు యువ హీరో రామ్ పోతినేని సీఎం సహాయ నిధికి రూ.25 లక్షలు విరాళమిస్తున్నట్టు ప్రకటించి..గొప్ప మనసు చాటుకున్నాడు. హీరో రామ్ కేటీఆర్‌ని కలిసి రూ. 25 లక్షల చెక్ అందించారు. ఆయన మంచి మనసుపై నెటిజన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇదిలా ఉంటే అక్టోబర్ 20న రామ్ విరాళం ఇవ్వనున్నట్టు ప్రకటించారు. నా తెలంగాణ ప్రజల పరిస్థితి గురించి ఆందోళన చెందుతున్నా. వరదలు వచ్చిన మొదటి రోజు నుంచి క్షేత్రస్థాయిలో పర్యటించడం సంతోషకర విషయం. వరద బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సేవలు ప్రశంసనీయం. ముఖ్యమంత్రి సహాయ నిధికి నా వంతుగా రూ.25 లక్షలు విరాళంగా అందజేస్తున్నానని రామ్ ట్వీట్ చేశారు.

ఉల్లి ధరలను పట్టించుకోని పాలకులు

-నిత్యావసర ధరలు స్వారీ చేస్తున్నా పట్టింపు లేని నేతలు

న్యూఢిల్లీ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): బీహార్ ఎన్నికల హడావిడిలో అన్ని పార్టీలు పరస్పర ఆరోపణలకే ప్రాధాన్యం ఇస్తున్నాయి తప్ప ప్రజలకిచ్చిన వాగ్దానాలను పట్టించుకోవడం లేదు. పాలకులు ఎవరికివారు ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చామని చెప్పుకుంటున్నారు. దేశంలో ఓవైపు వరదలతో ఉభయ తెలుగు రాష్ట్రాలు అతలాకుతలం అవుతున్నాయి. పంటలన్నీ నీట మునిగాయి. ఈ దశలో కూరగాయలతో పాటు, ఉల్లి ధరలు అమాంతంగా పెరిగాయి. ఉల్లి కనీస ధర మళ్లీ 60కి తగ్గడం లేదు. వరదల కారణంగా వందను దాటుతుందని, గతేడాది లాగే ధరలు పెరుగుతాయని వ్యాపారులు అంటున్నారు. ధరలు పెరుగుతున్న వేళ ప్రధానంగా కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం వచ్చిన తరవాత సామాన్యుల కలలు సాకార మయ్యాయా.. ఇచ్చిన హామీలు నెరవేరాయా అన్నది చూసుకోవాలి. మోడీ అధికారంలోకి వచ్చిన తరవాత దేశ ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. స్వాంత్ర్యం సిద్ధించి ఏడు దశాబ్దాలు దాటినా ఇంకా పేదల ఆకలిదప్పులు తీరడం లేదు. అత్యాచారాలు పెరిగాయి. మహిళలకు రక్షణ లేకుండా పోయింది. చదువుకుందామంటే అది ఖరీదైన వస్తువుగా మారింది. చదువులను కొనలేని దుస్థితి ఏర్పడింది. ఇలాంటి సమస్యలను పరిష్కరించడమే ముఖ్యం గానీ తాము అనుకున్న రీతిలో పనులు చేస్తూ అవే ప్రజా సమస్యల పరిష్కారం అని తలపోసేలా పాలకులు వ్యవహరిస్తున్నారు. అధికారంలోకి రాగానే మరో ఐదేళు గద్దెపై ఉండడమెలా అన్న ఆలోచనలకు అనుగుణంగా కార్యక్రమాలు చేయడం వల్లనే భారత్ ఇన్నేళ్ల తరవాత కూడా ఇంకా దారిద్ర్యం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహార ధాన్యాల కొరతతో అలమటిస్తోంది. దేశంలో ఇప్పటికీ సరైన ప్రజారోగ్య వ్యవస్థ లేదు. వ్యవసాయ రంగం కుంగి కృషించిపోతోంది. రైతులు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఆహారధాన్యాలకు మద్దతు ధరలు అందడం లేదు. విద్య మిధ్యగా మారింది. ఉద్యోగాల కల్పన అంతంత మాత్రంగానే ఉంది. ప్రజలు స్వేచ్ఛగా బతికేలా, ఆర్థికంగా ఎదిగేలా, పనిచేసుకుంటే పనిదొరికేలా పాలన చేయాలి. కేవలం వాగాడంబరాలతో ఎంతోకాలం ప్రజలను మభ్య పెట్టలేమని గుర్తించాలి. తాము చేస్తున్న పనుల వల్ల క్షేత్రస్థాయిలో మార్పులు వచ్చాయా లేదా అన్నది పాలకులు గమనించడం లేదు. విమర్శలను సానుకూల దృక్పథంతో తీసుకుని ముందుకు సాగడం లేదు. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి. రాజకీయాలను పక్కన పెట్టి సాను కూలంగా ఆలోచన చేసి ముందుకు సాగాల్సి ఉంది. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో ఆలోచన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విలాసాలకు ఖర్చు చేసుకుంటున్నారు. ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకురాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారమే కనుక,ఆ అధికారం కోసం ఎంతకైనా తెగబడతాయని నిరూపితం అయ్యింది. పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్నది. నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా పట్టించుకోవడం లేదు. ఉల్లి ధరలు ఆకాశన్నంటుతున్న వేళ ధరల నియంత్రణ జరగడం లేదు. కరోనా తరవాత అనేక రకాల వస్తువుల ధరలు పెరిగాయి. నూనెలు మండుతున్నాయి. మోడీ రాకతో ప్రజల్లో చిగురించిన ఆశలు వమ్మయ్యాయి. జిఎస్టీతో ప్రజలు మరింతగా కుంగిపోతున్నారు. జిఎస్టీని సమర్థించిన ఆయా రాష్ట్రాల సిఎంలే ఇప్పుడు దాని బారినుంచి రక్షించాలని కోరుకుంటున్నారు. వివిధ రంగాలపై అదిచూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన మోడీ ప్రభుత్వం మొదిగా వ్యవహరిస్తోందే తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. విద్యావైద్య రంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసుకోవాలి. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి.

తూర్పు తిరిగి దండం పెట్టాల్సిందేనా?

రైతుల కష్టాలపై పట్టింపు లేని పాలకులు

కాకినాడ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): తూర్పుగోదావరి జిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో వరి పంట నీటమునగగా, 70 వేల ఎకరాల్లో పూర్తిగా కుళ్లిపోయిందని వ్యవసాయశాఖ నిర్ధారించింది. తద్వారా అన్నదాతలకు పెట్టుబడి నష్టం రూ.110 కోట్లు వాటిల్లింది. ఇంకా వేలాది ఎకరాలు ముంపులోనే ఉన్నాయి. దీంతో కుళ్లినపంటను చూసి అన్నదాతలు లబోదిబోమంటున్నారు. ఇంతకష్టం వెన్నాడుతుంటే ప్రభుత్వం తరపున మంత్రులు కనీసం క్షేత్రస్థాయికి వెళ్లడం లేదు. అన్నదాత కష్టాన్ని చూడడం లేదు. సాక్షాత్తూ వ్యవసాయశాఖ మంత్రి కన్నబాబు కేవలం తన నియోజకవర్గానికే పరిమితమై పంట నష్టం పరిశీలిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మంత్రి హోదాలో జిల్లాలో దెబ్బతిన్న పంటల ముఖం చూసేందుకు పర్యటించకపోవడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. కోనసీమకు చెందిన మంత్రి విశ్వరూప్ రెండు రోజులు అమలాపురంరూరల్, అల్లవరం ప్రాంతాల్లో మునిగిన పంటలు చూశారు. ఆ తర్వాత మొత్తం గాలికి వదిలేశారని విమర్శిస్తున్నారు. పంట నష్టం ఎంత జరిగింది? అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లారా? అంచనాలు ఎప్పుడు మొదలుపెడతారు వంటి సమీక్ష లేదు. కనీసం మిగిలిన బాధిత ప్రాంతాల్లో కూడా తిరగడం లేదు. మరోమంత్రి వేణు తీరుపైనా విమర్శలు ఉన్నాయి. కాకినాడ తర్వాత రామచంద్రపురం డివిజన్‌లో అత్యధికంగా పంట నష్టం నమోదైంది. ఇదేదీ అసలు ఆయన దృష్టి

ఆహారం..ఆహార్యంలో నాయిని స్టయిలే వేరు



సోషలిస్ట్ నేతగా ఎదిగిన సామాన్య నేత
అంజయ్యను, సంజీవరెడ్డిలను ఓడించిన జైంట్ కిల్లర్

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): మాజీ హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి ఆహార్య ప్రత్యేకంగా ఉండేది. ఆయన తనకంటూ ప్రత్యేక శైలితో కనిపించేవారు. కొర్ర మీసాలు, ధోవతి, బుల్లెట్ ఆయన స్టయిల్. ఎక్కడికైనా బుల్లెట్‌పైనే వచ్చే వారు. ఆ సౌండ్ చూసి నాయిని వస్తున్నాడని నాయకులు గుర్తించేవారు. ఆయన ఆహార్యంలోనే కాకుండా ఆహారంలోనూ ఆయనది ప్రత్యేక తరహా. నాయినికి జొన్నరొట్టే, కోడి మాంసం అంటే భలే ఇష్టం. ఈ రెండింటి కాంబినేషన్ చిన్నప్పటి నుంచే ఆయనకు అలవాటు. అది చివరి వరకూ కొనసాగింది. ఆదివారం వచ్చిందంటే ఇంట్లో జొన్నరొట్టె, కోడి మాంసం వండాల్సిందే. ఈ వంటకాన్ని నాయిని అతి ఇష్టంగా తినేవారు. బేగంబజార్ జిలేబీ అంటే మహా ఇష్టం. ఇక పాతబస్తీలోని బేగంబజార్‌కు నాయినికి ఎంతో అనుబంధం ఉంది. సోషలిస్టు ఉద్యమాలు చేసిన సమయంలో బిజీగా ఉన్నప్పుడు కాస్త సేద తీరేందుకు నాయిని తన స్నేహితులతో కలిసి బేగంబజార్ వెళ్లేవారు. అక్కడ వేడివేడిగా వేసే జిలేబీని తిని ఆయన ఎంజాయ్ చేసేవాడు. ఇక ఒక గ్లాస్ పాలు తాగి తిరిగి ఇంటికి వచ్చేవారు నాయిని. సోషలిస్టు జీవితం.. సాదాసీదా మనస్తత్వం.. ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడే భోళాతనం.. నాయిని నర్సింహారెడ్డి సొంతం. సోషలిస్టుగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి అందరికీ అందుబాటులో ఉండే కార్మికనేతగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం చేసిన నాయిని రాష్ట్ర రాజకీయాల్లో జెయింట్ కిల్లర్‌గా అప్పట్లో సంచలనం సృష్టించారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో 1978లో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఒకవైపు ఇందిరా కాంగ్రెస్ నుంచి అప్పటి కార్మిక మంత్రి టి.అంజయ్య, మరోవైపు రెడ్డి కాంగ్రెస్ నుంచి గతంలో కార్మిక మంత్రిగా పనిచేసిన జి.సంజీవరెడ్డిలతో ఆయన ఢీ కొన్నారు. ఆ ఇద్దరినీ ఓడించారు. 2,167 ఓట్ల మెజార్టీతో గెలుపొంది సంచలనం సృష్టించి జెయింట్ కిల్లర్‌గా ఖ్యాతిపొందారు. 1985లో రెండోసారి, 2004లో మూడోసారి అదేస్థానం నుంచి గెలుపొందారు. 2004లో వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో టెక్నికల్ ఎడ్యుకేషన్ మంత్రిగా సేవలందించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కేబినెట్ నుంచి టీఆర్ఎస్ వైదొలగిన సమయంలో అమెరికాలో ఉన్న నాయిని అక్కడి నుంచే నేరుగా తన రాజీనామా పత్రాన్ని గవర్నర్‌కు పంపి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో తన నిబద్ధతను చాటుకున్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఎమ్మెల్సీగా ఎన్నికై హోంమంత్రిగా, కార్మిక శాఖల మంత్రిగా పనిచేశారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో కేసీఆర్ వెన్నంటి ఉండి ప్రత్యేక రాష్ట్ర సాధనలో నాయిని కీలకపాత్ర పోషించారు.

1958 జనవరి 26వ తేదీన సోషలిస్టు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ పార్టీ సమావేశం నాగార్జున సాగర్‌లో జరగగా దానికి సోషలిస్టు నాయకుడు బద్రి విశాల్ పిత్తి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా స్థానిక నాయకుడు పాశం రుక్మారెడ్డితో సోషలిస్టు పార్టీ కార్యాలయంలో నమ్మకంగా పని చేయడానికి, చురుకైన ఓ కార్యకర్త కావాలని కోరగా అప్పుడు నాయిని నర్సింహారెడ్డి పేరును రుక్మారెడ్డి సూచించారు. దీంతో నాయిని ఆఫీసు కార్యదర్శిగా పని చేయడానికి 1962లో మొట్టమొదటిసారి హైదరాబాద్ వచ్చారు. ఈ క్రమంలో ఆఫీసు బాధ్యతలతోపాటు పార్టీ కార్యక్రమాల్లో కూడా చురుగ్గా పాల్గొన్నారు. సోషలిస్టు పార్టీ జాయింట్ సెక్రటరీగా, ఆ తర్వాత రాష్ట్ర కార్యదర్శిగా పదోన్నతి పొందుతూ వచ్చారు. ఈ క్రమంలో ట్రేడ్ యూనియన్ లీడర్‌గా మారి కార్మిక సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు. మొదట హమాలీ, తోపుడు బండ్ల కార్మికుల సమస్యలపై ఉద్యమించారు. నగరంలో మంచి పేరుప్రఖ్యాతలు సంపాదించారు. కార్మిక నాయకుడిగా ముద్ర వేసుకున్నారు. అనంతరం నాయిని నర్సింహారెడ్డి ప్రతిష్టాత్మకమైన వీఎస్‌టీ, ఐడీఎల్, హెచ్ఎంటీ, గంగప్ప కేబుల్స్, మోడ్రన్ బేకరి వంటి కంపెనీల్లో కార్మికనేతగా గెలుపొందడంతో పాటు సికింద్రాబాద్ హాకర్స్ యూనియన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్లకు అధ్యక్షుడిగా కూడా కొనసాగారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం 1975లో దేశంలో ఎమర్జెన్సీ విధించింది. నాయిని నర్సింహారెడ్డిని అరెస్టు చేసి ముషీరాబాద్ జైల్లో 18 నెలల పాటు నిర్బంధించారు. ఎమర్జెన్సీ మొత్తంకాలం నాయిని జైల్లోనే గడిపారు.

నాగరాజు లాకర్లలో కేజీకి పైగా బంగారం

బినామీ నందగోపాల్ పేరుతో లాకర్

మేడ్చల్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కీసర మాజీ తహసీల్దార్ నాగరాజు కోటి రూపాయల అవినీతి కేసులో ఏసీబీ దూకుడు పెంచింది. విచారణ ఎదుర్కొంటూ ఇటీవల ఆయన ఆత్మహత్యకు పాల్పడటంలో కేసును మరింత వేగవంతం చేసింది. ఈ క్రమంలోనే అల్వాల్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో నాగరాజు లాకర్లను ఏసీబీ అధికారులు ఓపెన్ చేశారు. నాగరాజు బినామీ నందగోపాల్ పేరుతో ఉన్న ఈ లాకర్‌లో దాదాపు కేజీకిపైగా బంగారు ఆభరణాలను గుర్తించారు. బినామీ పేరుతో పెద్ద ఎత్తున్న ఆస్తులు కూడబెట్టినట్టు గుర్తించి ఏసీబీ... ఇతర ఖాతాలపై విచారణ చేస్తున్నారు. రెండు రోజులు క్రితం నందగోపాల్ నివాసంలో ఏసీబీ సోదాలు నిర్వహించగా.. లాకర్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. దీంతో రంగంలోకి దిగిన అధికారులు లాకర్లు ఓపెన్ చేయగా.. పెద్ద ఎత్తున బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకునారు. కాగా ఇంతకుముందు మరో బ్యాంక్ లాకర్లలో రెండు కేజీల బంగారాన్ని సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఆగస్టు 14వ తేదీన నాగరాజు ఇంటిపైన దాడి చేసిన సమయంలో ఏసీబీ అధికారులకు ఓ బ్యాంకు లాకర్‌కు చెందిన తాళంచెవి లభించింది. అది నాగరాజు బంధువైన జి.జే.నరేందర్ పేరిట అల్వాల్‌లోని సౌత్ ఇండియన్ బ్యాంకు లాకర్‌గా ఏసీబీ గుర్తించింది. ఏసీబీ అధికారులు కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించిన సమయంలోనూ నాగరాజు లాకర్ విషయంలో సహకరించలేదని సమాచారం. ఎట్టకేలకు సదరు లాకర్‌ను తెరిచిన ఏసీబీ అధికారులకు అందులో 1532 గ్రాముల బంగారు ఆభరణాలు లభించాయి. వాటిని సీజ్ చేసిన ఏసీబీ అధికారులు న్యాయస్థానంలో డిపాజిట్ చేయనున్నారు. ప్రస్తుతం కేసులో పట్టుబడ్డ నిందితులంతా చంచల్ గూడ జైల్లోనే ఉన్నారు

జార్జ్ ఫెర్నాండెజ్‌కు నిజమైన శిష్యుడు

లోహియా మార్గంలో నడిచిన గొప్ప నాయకుడు: వినోద్ నివాళి

నాయిని నర్సింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పించిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): సోషలిస్టు జాతీయ నాయకుడు జార్జ్ ఫెర్నాండెజ్‌కు నాయిని నర్సింహారెడ్డి ప్రియమైన శిష్యుడు. రామనోహర్ లోహియా మార్గంలో నడిచిన గొప్ప నాయకుడు నాయిని. తెలంగాణ ఉద్యమ కాలంలో కేసీఆర్‌కు అండగా నిలిచారని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. గురువారం మంత్రుల నివాస ప్రాంతంలో నాయిని నర్సింహారెడ్డి భౌతిక కాయానికి పూల మాలలు వేసి వినోద్ కుమార్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో సోషలిస్టు ఉద్యమానికి తెలంగాణ ప్రాంతం నుంచి వెన్నెముకగా నిలిచిన నాయిని సేవలు మారువలేమని పేర్కొన్నారు. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం ఉద్యమించిన తొలి, మలి విడత ఉద్యమకారుడు నాయిని అని, ఉద్యమ నాయకులు కేసీఆర్ కు నాయిని సంపూర్ణ సహకారాన్ని అందించారని వినోద్ కుమార్ కొనియాడారు. కార్మికుల ఉద్యమాల్లో నాయిని ఉద్దండులు అని, కార్మికుల సంక్షేమం కోసం ఎనలేని కృషి చేశారని ఆయన తెలిపారు. నర్సింహారెడ్డి భోళా శంకరుడు అని, అతనిది పసివాని హృదయమన్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా నాయినితో అనుబంధం ఉందని వినోద్ కుమార్ గుర్తు చేశారు. నాయినికి నివాళులు అర్పించిన వారిలో డాక్టర్ బోయినపల్లి ప్రతీక్, బోయినపల్లి ప్రణయ్ ఉన్నారు.

రామలింగన్న ఆశయాలను కొనసాగిస్తా : సోలిపేట సుజాత

సిద్దిపేట, అక్టోబర్ 22 : దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి అనునిత్యం పాటుపడిన సోలిపేట రామలింగారెడ్డి ఆశయాలను కొనసాగిస్తానని దుబ్బాక టీఆర్ఎస్ అభ్యర్థి సోలిపేట సుజాత అన్నారు. గురువారం చేగుంట మండలం వల్లభపూర్, తాండ, నర్సంపల్లి, చిట్టోజిపల్లి, పొలంపల్లి, పోతన్ శెట్టి పల్లి గ్రామాల్లో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ మంత్రి సునితా లక్ష్మారెడ్డితో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో మీ ముందుకు వచ్చాను.దుబ్బాకను రామలింగారెడ్డి అభివృద్ధి చేశాడు. నాకు మరింత అభివృద్ధి చేసే అవకాశం కల్పించండని ఓటర్లను వేడుకున్నారు. మంత్రి హరీష్ రావు, ఎంపీ ప్రభాకరన్నల సహకారంతో మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కారు గుర్తుకు ఓటేసి నన్ను గెలిపించండని విజ్ఞప్తి చేశారు. మెదక్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ తప్పుడు ప్రచారాలు చేస్తున్నదని విమర్శించారు. దేశంలో ఎక్కడలేని విధంగా తెలంగాణలో పథకాలు అమలు చేస్తున్న ఏకైక సీఎం కేసీఆర్ అన్నారు. కాగా, గ్రామస్తులు బతుకమ్మలు, బోనాలతో ఘన స్వాగతం పలికారు.

ఆరోగ్య భరోసా ఇవ్వని ప్రధాని ప్రసంగం

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ):పండుగల వేళ కరోనాతో జాగ్రత్తగా ఉండాలని..కరోనా తగ్గిందన్న భ్రమలో ఉండరాదని ప్రధాని మోడీ దేశ ప్రజలను హెచ్చరించిన వేళ ..ప్రజల అవస్థల గురించి ఒక్కమాట కూడా మాట్లాడ లేదు. కరోనా ముప్పు తొలగలేదని..ప్రజలు మాస్కులు ధరించి రెండు గజాల దూరం పాటించాలని అన్నారు. అలాగే వ్యాక్సిన్ పరిశోధనలు పురోగతిలో ఉన్నాయని, అందరికీ వ్యాక్సిన్ అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. క్లుప్తంగా మాట్లాడిన ప్రధాని తన ప్రసంగంలో ప్రజలకు ఎలాంటి అభయం ఇవ్వలేదు. ప్రజలు ఎలా బతుకుతున్నారో గుర్తించినట్లు చెప్పలేదు. ఆర్థికంగా చితికిపోయిన ప్రజలకు ఎలాంటి స్వాంతన వచనాలు చెప్పలేదు. కరోనాతో గత ఆరు నెలలుగా పోరాడుతున్న ప్రజలు ఆర్థికంగా బాగా చితికి పోయారు. అనేక కుటంబాలు ఉపాధి లేక.. ఆరోగ్య రక్షణ కోసం లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. కరోనా సోకిన వారు కొందరు కోట్లు ఖర్చు చేసినా బతికిన దాఖలాలు లేవు. కరోనాపై ఆస్పత్రుల్లో భరోసా ఇవ్వలేని దుస్థితి నెలకొంది. ఈ దశలో కేంద్రం ప్రజల ఆరోగ్య ఖర్చులపై భరోసా ఇచ్చేలా ప్రధాని హామీ ఇస్తారని అంతా ఎదురు చూశారు. కేంద్రం ఇప్పటికే తీసుకుని వచ్చిన ఆయుష్మాన్ భారత్ కావచ్చు ...రాష్ట్రాల్లో అమలవుతున్న ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు కావచ్చు... ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం లేదు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేసి, వైద్యులను, వైద్య సిబ్బందిని పెంచాల్సి ఉందన్న అనుభవాలను, హెచ్చరికలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతరు చేయడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రులు అడ్డంగా దోచుకుం టున్నా... ప్రభుత్వాలు చోద్యం చూస్తున్నాయి. వారిని పల్లెత్తు మాట అనడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లి డబ్బులు దండగ చేసుకోవద్దన్న హితబోధలు చేస్తున్నాయే తప్ప ..దోపిడీపై చర్యలకు ఉపక్రమించడం లేదు. ప్రస్తుత కరోనా పరిస్థితుల్లో దేశంలో ప్రజలు తమకు సంపాదన ఉన్నా లేకున్నా..అప్పు చేసైనా లక్షలాది రూపాయాలను వైద్యానికే ఖర్చు చేయాల్సి దుస్థితి దాపురిస్తోంది. ఆయుష్మాన్ భారత్ పేరుతో కేంద్రం కొత్తగా ఆరోగ్య సౌకర్యాలను కల్పించినా, రాష్ట్రాలు ఆరోగ్యశ్రీ పథకాలు ప్రకటించినా ప్రభుత్వ పరంగా ఆస్పత్రులను బలోపేతం చేస్తే తప్ప సమస్యలు తీరేలా లేవు. క్షేత్రస్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. జాతిపిత గాంధీ పేరు నిత్యం వల్లిస్తున్న నేతలు ఆయన ఆశయాలకు అనుగుణంగా గ్రామాలను ఆరోగ్యపరంగా అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని గుర్తించడం లేదు. పల్లెల్లో స్వచ్ఛ వాతావరణం కలిగేలా చూడాలి. ఆస్పత్రులను పటిష్టం చేయకుండా ఎన్ని పథకాలు ప్రవేశ పెట్టినా లాభం లేదన్న విషయాన్ని పాలకులు గుర్తించాలి. పథకాలతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆర్థికంగా బలోపేతం చేయడం తప్ప మరోటి కాదు. ప్రభుత్వ రంగంలో వైద్యం అందుబాటులోకి రావడం లేదు. కరోనా వైద్యం ఖర్చుతో కూడుకున్నదిగా మారింది. ప్రభుత్వాసు పత్రుల్లో కరోనా చికిత్సలకు భరోసా దక్కడం లేదు. ఎన్ని పథకాలు ప్రవేశ పెడుతున్నా అవి అమలు కావడం లేదు. కనీసం మందులన్నా చవకగా దొరుకు తాయన్న భరోసా లేదు. కరోనా కష్టాల సమయంలో మందుల ధరలు విపరీతంగా పెంచారు. ఫార్మా కంపెనీలు కూడా దోచుకోవడమే లక్ష్యంగా మందుల ధరలను అడ్డదిడ్డంగా పెంచేశాయి. శానిటైజర్లు, మాస్కులు కూడా ఖర్చుతో కూడుకున్నవిగా అయ్యాయి. మొత్తంగా వైద్యరంగం ఖర్చుతో కూడుకున్నదిగా మారింది. చికిత్సలు ఒక ఎత్తయితే, చికిత్సానంతరం ఔషధాల ధరలు మరో ఎత్తుగా మారాయి. కరోనా కష్టాలకు తోడు సామాన్యులకు వైద్య ఖర్చులు భరించరాని వేదనగా మారుతోంది. ఇన్సూరెన్స్ చేయించుకున్నా కరోనాకు పనికి రాకుండా పోతున్నది. కరోనా చికిత్సకు ఇన్సూరెన్స్ లేదని ఖరాఖండిగా చెప్పేస్తున్నాయి. కనీసం ఇన్సూరెన్స్

సంస్థలను కూడా అజమాయిషీ చేసే సత్త కేంద్రంలో లేకుండా పోయింది. సవాలక్ష కారణాలతో సామాన్యులకు మాత్రం సమయానికి వైద్యం అందడం లేదన్నది నూటికి నూరుపాళ్లు నిజం. రోగం వస్తే చాలు మందుల కొనుగోళ్లకే ఇల్లు గుల్ల చేసుకోవాల్సిన పరిస్థితి ముందునుంచీ ఉంది. దానికి తోడు కరోనా మహమ్మారి దాపురించింది. ప్రధానంగా ఆస్పత్రుల్లో ఎక్కువ భాగం మందులకు కూడా ఖర్చు చేయాల్సి వస్తోంది. కరోనా ప్రభావంతో ఇటీవలికాలంలో మందుల ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో సామాన్యులకు మందుల భారం కూడా విపరీతంగా పడుతోంది. అధికారంలో ఉన్న వారు ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలకు మాత్రం వెతలు తప్పడం లేదు. కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహంతో మంచి రోజులు వస్తాయమని భావిస్తున్నా అమలులో మాత్రం అడుగు పడడం లేదు. బడా ఔషధ కంపెనీలు తమ ఉత్పాదనలను అధిక ధరలకు విక్రయించడం వల్లే ఈ పరిస్థితి నెలకొంటుంది. వారి లాభం కోసం వీటిని రోగులకు అంటగడుతున్నారు. సామాన్యులు మాత్రం వైద్యుల స్వార్థంతో ఆర్థికంగా నష్టపోయి ఇల్లు గుల్ల చేసుకుంటున్నారు. కరోనా వైద్యం ఖర్చుతో కూడుకున్న వేళ కేంద్రం ఎలాంటి హామీ ఇవ్వడం లేదు. ప్రధాని కేవలం ప్రసంగాలకే పరిమితం అయ్యారు. ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయిన కోట్లాది మందిపై ఇప్పుడు కరోనా స్వారీ చేస్తోంది. ప్రజలు ఇల్లు దాటితే తప్ప కడుపులోకి ముద్దదిగని పరిస్థితుల్లో ఉన్నారు. ఈ దశలో కరోనా వ్యాక్సిన్ వచ్చే వరకు కేంద్రం కార్యాచరణకు పూనుకోవాలి. ఆయుష్మాన్ భారత్ వంటి పథకాలు దేశ ఆరోగ్య రంగాన్ని బాగు చేయలేదని కేంద్రం గుర్తించాలి. ఆస్పత్రులను అభివృద్ధి చేసే దిశగా చర్యలకు పూనుకోవాలి. వైద్యరంగానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి వాటిని ప్రభుత్వ ఆధీనంలో నడిపించాలి. వైద్యుల నియామకంతో పాటు ఆధునిక యంత్రపరికరాలను సమకూర్చాలి. ప్రభుత్వ ఆస్పత్రులు బలోపేతం అయితే ప్రైవేట్ రంగంలో కూడా వైద్య ఖర్చులు దిగి రాగలవు. లేకుంటే రోజురోజుకూ వైద్యం అందని ద్రాక్ష కాగలదు. కరోనా సమయంలో అనేక సవాళ్లను చూశాం. ఆ సవాళ్లను అధ్యయనం చేసి, వైద్య ప్రముఖుల సూచనలు తీసుకుని దేశ వైద్యరంగాన్ని బలోపతేం చేయడానికి ఉపక్రమించాలి. ప్రధాని నరేంద్ర మోడీ మాటలతో కాకుండా చేతల్లో తన చాతుర్యం ప్రకటించాలి. అప్పుడే ప్రజలకు స్వాంతన చేకూరగలదు.

కళ్యాణలక్ష్మితో పేదింట్లో భరోసా: కొప్పుల

పెద్దపల్లి,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు నిరుపేదలకు కొండంత అండ అని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. ఈ పథకాలతో ఆడపిల్లకు భరోసా దక్కిందన్నారు. వారి పెళ్లికి ఖర్చులను ఇచ్చే బాధ్యతను ప్రభుత్వమే తీసుకుందన్నారు. జిల్లాలోని పాలకుర్తి మండలం ముంజంపల్లి, మారేడుపల్లి, ఉండేడ గ్రామాలకు చెందిన లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న షాదీముబారక్, కల్యాణ లక్ష్మి పథకాలు నిరుపేదల ఆడపిల్ల తల్లి దండ్రులకు ఎంతో మనో ధైర్యాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వ్యాల్ల అనసూర్య, సర్పంచ్ ప్లలె అశోక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు

హైదరాబాద్ వరదలపై స్పందించిన రామోజీ

పదికోట్ల విరాళం ప్రకటన
కెటిఆర్‌కు చెక్కు అందించిన దర్శకుడు శంకర్

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు, వరదల మూలంగా హైదరాబాద్ నగర ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. చాలా మంది జీవన విధానం చిన్నాభిన్నం అయ్యింది. ప్రజలు పడుతున్న కష్టాలు చూసి వారి సహాయక కార్యక్రమాలు చేపట్టేందుకు పలువురు సినీ సెలబ్రిటీలు, పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు ముందుకు వస్తున్నారు. తాజాగా రామోజీ గ్రూప్ చైర్మన్ రామోజీరావు రూ.5 కోట్ల విరాళాన్ని ప్రకటించారు. వరదల వలన నిరాశ్రయులైన బాధితులకు ఆహారం, సరుకులు అందించేందుకు గాను రూ.5 కోట్ల రూపాయల విరాళాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందించనున్నట్టు తెలిపారు. వరుణుడి విలయతాండవంతో భాగ్యనగరం వణికిపోయింది. అనుకోని వరదలతో చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. లక్షలాది మంది నిరాశ్రయులుగా మారారు. బాధితులను ఆదుకునేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపడుతోంది. అదే సమయంలో విపత్తులు ఎదురైన ప్రతిసారి మేమున్నామంటూ ముందుకొచ్చే సినీతారలు భాగ్యనగర వాసుల్ని ఆదుకునేందుకు కదిలివస్తున్నారు. విరాళాల్ని అందిస్తూ వరద బాధితులకు అండగా నిలుస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన పిలుపుతో తన వంతు బాధ్యతగా సీఎం రిలీఫ్‌ఫండ్‌కు పది లక్షల రూపాయల్ని విరాళంగా దర్శకుడు ఎన్.శంకర్ ప్రకటించారు. ఈ మేరకు ఆయన కేటీఆర్‌ని కలిసి చెక్ అందించారు.

దుబ్బాకలో టీఆర్ఎస్ పార్టీకి అపూర్వ స్పందన

సిద్దిపేట, అక్టోబర్ 22: దుబ్బాక ఉప ఎన్నికలో టీఆర్ఎస్ పార్టీకి అపూర్వ స్పందన లభిస్తుందని ఆర్థిక మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు. తోగుట మండలంలోని పలు గ్రామాలకు చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరందరికి మంత్రి హరీష్ రావు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీజేపీ నాయకులు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 60 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలోనే చేసి చూపించామని తెలిపారు. రాబోయే రోజుల్లో కూడా టీఆర్ఎస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మోసపూరిత మాటలు నమ్మొద్దు అని ప్రజలకు సూచించారు. రాబోయే రోజుల్లో తోగుట మండలానికి మల్లన్నసాగర్ ప్రాజెక్టు నీటిని తీసుకువస్తామన్నారు. ఎన్నికలు వస్తేనే గ్రామాల్లోకి కాంగ్రెస్, బీజేపీ నాయకులు వస్తారు. కానీ టీఆర్ఎస్ పార్టీ నాయకులు మాత్రం నిత్యం ప్రజల మధ్యే తిరుగుతూ వారి సమస్యలను పరిష్కారిస్తారని తెలిపారు. టీఆర్ఎస్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి స్థాయిలో నమ్మకం ఉంది కాబట్టే గులాబీ పార్టీకి జై కొడుతున్నారని మంత్రి హరీష్ రావు స్పష్టం చేశారు.

అనుమానాస్పద స్థితిలో గర్భిణి ఆత్మహత్య

వివరాలు సేకరిస్తున్న పోలీసులు

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): అనుమానాస్పద రీతిలో ఓ గర్భిణి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హైదరాబాద్ నగర పరిధిలోని జగద్గిరిగుట్ట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన లీల కుమార్తె కృష్ణప్రియ(24) ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండేది. జగద్గిరిగుట్ట పాపిరెడ్డినగర్‌కు చెందిన శ్రవణ్‌కుమార్ జిమ్ నిర్వహిస్తున్నాడు. వీరిద్దరూ దూరపు బంధువులు కావడంతో కొన్నేళ్లు ప్రేమించుకున్నారు. నాలుగేళ్ల క్రితం ఓ వ్యక్తితో కృష్ణప్రియకు వివాహం కాగా అతనితో విడాకులు తీసుకుంది. అనంతరం శ్రవణ్‌కుమార్‌తో ఆమెకు వివాహం కాగా, ప్రస్తుతం కృష్ణప్రియ ఐదు నెలల గర్భిణి.ఈ క్రమంలో బుధవారం రాత్రి కృష్ణప్రియ ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. శ్రవణ్‌కుమార్, అతని కుటుంబసభ్యులు అదనపు కట్నం కోసం తమ కుమార్తెను వేధించడంతోనే ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి లీల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతులను కూడా ఆదుకోవాల్సిందే

-మునుగోడులో దీక్షకు దిగిన కోమటిరెడ్డి

నల్గొండ,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): వరదలో నష్టపోయిన రైతులకు ఒక్కొక్కరికి రూ.20వేలు ఇవ్వాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. తడిసిన పత్తిని సీసీఐ కేంద్రాలతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. వరదలతో నష్టపోయిన రైతులను ఆదుకోకుండా దగ్గర్లో ఉన్న జీహెచ్ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని హైదరాబాద్‌లో ఇంటికి రూ.10వేలు ఇస్తున్నారని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు. మునుగోడులో ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి నిరాహారదీక్షకు కూర్చొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతు ప్రభుత్వమని చెప్పుకునే కేసీఆర్ ప్రభుత్వం రైతులకు చేసింది ఏమి లేదన్నారు. వరద బీభత్సంతో నష్టపోయిన రైతుల గురించి ఏ ఒక్కరైనా పర్యటించి ఒక్క ప్రకటన చేసిన దాఖలాలు లేవన్నారు. అన్నం పెట్టే రైతు విషయంలో ప్రభుత్వం కచ్చితంగా ఆదుకోవాలన్నారు. ఎన్నికలు వస్తే కేసీఆర్ అకౌంట్లలో డబ్బులు వేయడం తర్వాత వదిలి వేయడం పరిపాటిగా మారుతోందని రాజగోపాల్‌రెడ్డి విమర్శించారు.

తెలంగాణ ఓ గొప్ప నేతను కోల్పోయింది

-మంత్రులు ఈటెల తదితరుల సంతాపం

హైదరాబాద్,అక్టోబర్22(ఆర్ఎన్ఎ): తెలంగాణ తొలి హోంమంత్రి, కార్మిక నేతగా విశేష సేవలందించిన నాయిని నర్సింహారెడ్డి చికిత్స పొందుతూ మృతి చెందగా.. నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మాజీ హోంమంత్రి మృతికి మంత్రి ఈటల రాజేందర్ సంతాపం ప్రకటించారు. ఉద్యమ సమయంలో నాయినితో ఉన్న అనుబంధం మరువలేనిదన్నారు. ఆయన లేని లోటు పార్టీకి, తెలంగాణ సామాజానికి తీరని లోటన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ కుటుంబాన్ని సంతాపం ప్రకటించారు. మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి నాయిని కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. హోంమంత్రిగా, కార్మిక నేతగా విశేష సేవలందించారని గుర్తు చేసుకున్నారు. ఆయన లేని లోటు పూడ్చలేదన్నారు. కుటుంబానికి సంతాపం ప్రకటించారు. కార్మికుల కొరకు తన పూర్తి జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి మాజీ హోం మ